విశాలాంధ్ర

కృష్ణా, ఎన్టీఆర్ గుంటూరు, పల్నాడు

మంగళవారం 12 నవంబరు 2024 8 పేజీలు

దాళ్వాపై వీడని సందిగ్ధత..!

- రెండో పంటపై ఎన్నికల హామీ అమలయ్యేనా..
- అయోమయంలో రైతాంగం
- 'కాగిత' రాజకీయ సమర్థతకు మొదటి పరీక్ష
- నియోజకవర్గ రైతుల ఆకాంక్షను కాగిత నెరవేర్చేనా...?

కృష్ణా డెల్టాలో రెండో పంటకు అనుమతి ఇచ్చి రైతులను ఆదుకుంటామని ఎన్నికలలో హామీ ఇచ్చిన ఎన్డీఏ కూటమి తీరా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దాళ్వా పంటపై స్పష్టత ఇవ్వకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

విశాలాంధ్ర-కృత్తివెన్ను : నీటి ప్రాజెక్టులలో పుష్కలంగా నీరున్న పరిస్థితిలో తక్షణం దాళ్వా పంటకు అనుమతి ఇవ్వాలని తీర ప్రాంత రైతాంగం డిమాండ్ చేస్తుంది. ముఖ్యంగా రెండో పంట పైనే ఆశలు పెట్టుకున్న పెడన నియోజవర్గ రైతులలో అయోమయం నెలకొంది. ఖరీఫ్ పంట అరకొరగా చేతికి అందుతున్న దశలో రెండో పంటపై రైతులు ఆశ పెట్టుకున్నారు. అదును తప్పితే రెండో పంట ప్రకటన చేసినా ఉపయోగం ఉండదని రైతులు వాపోతున్నారు. తక్షణం రెండవ పంటకు నీరు విడుదల చేసే విధంగా చర్యలు తీసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ కు రైతులు విజ్ఞప్తులు చేస్తున్నారు. పెడన నియోజకవర్గం లో దాదాపు రెండు లక్షల ఎకరాలు వరి పంట సాగు చేస్తున్నట్లు వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు. ఈ రైతులందరూ దాళ్వా పంటకు అనుమతి ఇవ్వాలని కోరుతున్నారు. గత ఎన్నికల ప్రచారంలో అధికారంలోకి వస్తే రెండు పంటలకు నీరు ఇస్తామని నాయకులు హామీ ఇచ్చిన విషయాన్ని -మిగతా 2 లో ...

మున్సిపల్ కార్మికులకు జీతం

రూ. 26 వేలకు పెంచండి

- కార్మికుల సమస్యలను మంత్రి నారాయణ దృష్టికి తీసుకువెళ్లిన ఏఐటీయూసీ నాయకులు

విశాలాంధ్ర-విజయవాడ: రాష్ట్రంలోని మున్సిపల్ కార్మికులకు జీతం రూ. 26వేలకు పెంచాలని ఏఐటీయూసీ నాయకులు ప్రభుత్వానికి విజ్ఞపి చేశారు. విజయవాడ నగరపాలక సంస్థలో పనిచేస్తున్న వేలాది మంది మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను సోమవారం రాష్ట్ర సచివాల యంలో మున్సిపల్ శాఖ మంత్రి పినారాయణను సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే.రామకృష్ణ ఆధ్వర్యంలో ఏఐటీయూసీ నాయకత్వం కలిసి వినతి పత్రం సమర్పించారు. మున్సిపల్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం కనీస రూ. 26వేలు, ఇవ్వాలని కోరారు. పార్కులు, ఇతర ప్రాంతాలలో ఒప్పంద కార్మికుల వేతనాల్లో తేడాలను ఉన్నాయని, అందరికీ సమావన వేతనం చెల్లించాలని -మిగతా 2 లో ...

ప్రజా సమస్యలపై

కమ్యూనిస్టుల పోరాటం

సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతీ వరప్రసాద్

విశాలాంధ్ర-వినుకొండ : మనదేశంలో 100 సంవత్సరాల చరిత్ర కలిగిన భారత కమ్యూనిస్టు పార్టీ పేద బడుగు బలహీన వర్గాల ప్రజల కోసం నిరంతరం నిజాయితీగా పోరాటాలు చేసిందని, ఆనాడు స్వాతంత్ర్య సంగ్రామంలో తెల్లదొరలు ఈ దేశం నుండి వెళ్లిపోవాలని మన దేశానికి సంపూర్ణ స్వాతంత్రం కావాలని మొట్టమొదటిసారిగా నినదించిన పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అని సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతీ వరప్రసాద్ అన్నారు. వినుకొండ పట్టణంలోని శివయ్య భవన్లో సోమవారం ఉదయం జరిగిన సీపీఐ పట్టణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ. సీపీఐ రాష్ట్ర సమితి పిలుపు మేరకు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో పార్టీ గ్రామ పట్టణ నియోజకవర్గాల లోని అన్ని శాఖల సమావేశాలు నిర్వహించాలని ఆయా శాఖలలో ఉన్న సమస్యలను చర్చించి పరిష్కారానికి తగు నిర్ణయాలు పోరాట కార్యక్రమాలు రూపొందించాలని ఆయన తెలిపారు. ఈ డిసెంబర్ 26 నాటికి పార్టీ ఆవిర్భవించి -మిగతా 2 లో ...

సచివాలయ ఉద్యోగులు

సమయపాలన పాటించాలి

గుంటూరు కలెక్టర్ నాగలక్ష్మి

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: జిల్లాలో గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండేలా మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు నిరంతరం పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి అభివృద్ధి , సంక్షేమ కార్యక్రమాలపై ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, తహశీల్దార్లు, మండలస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా -మిగతా 2 లో ...

కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి

సహకరించండి

నగర కమిషనర్‌కు సీపీఐ వినతి

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : స్థానిక గణేష్ నగర్ వడ్డెర కమ్యూనిటీ స్థలం ఆక్రమణలు తొలగించి కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి సహకరించాలని సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి కోరారు. ఈ మేరకు గుంటరు నగరపాలక సంస్థ కమిషనర్ గ్రీవెన్స్‌లో సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కోట మాల్యాద్రి -మిగతా 2 లో ...

ప్రజల అర్జీలు సకాలంలో

పరిష్కరించాలి

కృష్ణా జిల్లా కలెక్టర్ డీకె. బాలాజీ

విశాలాంధ్ర బ్యూరో మచిలీపట్నం : నగరంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ డీకె. బాలాజీ, జాయింట్ కలెక్టర్ గీతాంజలీ శర్మ, డిఆర్ఓ కె. చంద్రశేఖర రావు, కెఆర్ఆర్సి ఎస్డీసి శ్రీదేవి, మచిలీపట్నం ఆర్డీఓ కె. స్వాతి కలిసి ప్రజాసమస్యల పరిష్కార వేదిక మీకోసం కార్యక్రమం నిర్వహించి వివిద ప్రాంతాల ప్రజల నుండి అర్జీలు -మిగతా 2 లో ...

(మొదటి పేజీ తరువాయి)

దాళ్వాపై వీడని సందిగ్ధత..!

రైతులు గుర్తు చేస్తున్నారు. నష్టం వస్తుందని తెలిసినా పొలాలు బీడువారకుండా రైతులు మొదటి పంట సాగు చేస్తారు. ఆ నష్టాన్ని రెండో పంట సాగు తో రైతులు భర్తీ చేసుకుంటారు. అయితే గత నాలుగు సంవత్సరాలుగా రైతులకు రెండో పంట లేకపోవడంతో తీవ్ర అప్పుల ఊబిలో కురుకుపోయారు. కూటమి ప్రభుత్వం రెండో పంట హామీని నిలబెట్టుకుంటుందని రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు. ఈ పరిస్థితిలో శాసనసభ్యులు కాగిత పైనే రైతాంగం ఆశలు పెట్టుకున్నారు. నియోజవర్గంలో వ్యవసాయ పరిస్థితులపై పూర్తి అవగాహన ఉన్న కాగిత రెండో పంటకు అనుమతి తీసుకు వస్తారని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు. అయితే ఇప్పటివరకు దాళ్వా పంటపై జిల్లాస్థాయి నాయకులు గాని, అధికారులు కానీ ఎటువంటి ప్రకటన చేయకపోవడంతో రైతుల్లో అసంతృప్తి నెలకొంది. రెండో పంటకు ప్రభుత్వాన్ని ఒప్పించి అనుమతులు తీసుకువచ్చే విషయంలో కాగిత ఎంతవరకు సఫలీకృతం అవుతారో వేచి చూడాలి. కృష్ణా పరివాహ ప్రాజెక్టులన్నీ నిండుకుండలను తలపిస్తున్న తరుణంలో దాళ్వా పంటకు అనుమతి ఇవ్వడం లో ఎందుకు కాలయాపన చేస్తున్నారని రైతులు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం తక్షణం రెండో పంటకు అనుమతి ఇవ్వాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. దాళ్వా పంటకు అనుమతులు తీసుకొచ్చే విషయంలో నూతనంగా ఎన్నికైన శాసన సభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ రాజకీయ సమర్థతపైనే ఆధారపడి ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అయితే రైతుల పరిస్థితులు గురించి పూర్తిగా తెలిసిన శాసన సభ్యులు కాగిత తప్పనిసరిగా దాళ్వా పంటకు అనుమతి తీసుకొస్తారని తీర ప్రాంత రైతాంగం ఆశగా ఎదురుచూస్తుంది.

మున్సిపల్ కార్మికులకు జీతం రూ. 26 వేలకు పెంచండి

కోరారు. పెరుగుతున్న నగర విస్తరణ, జనాభాకి అనుగుణంగా నూతనంగా నగరం లో మున్సిపల్ కార్మికుల సంఖ్యను పెంచాలన్నారు. ఒప్పంద కార్మికులందరినీ క్రమ బద్ధీకరించాలని, డ్వాక్రా, సీఎంఈవై కార్మికుల పదవీవిరమణ వయస్సును శాశ్వత కార్మికుల మాదిరిగానే 62 సంవత్సరాల వరకు పెంచాలన్నారు. కార్మికులు రోడ్లపై పనిచేస్తున్న సమయంలో ప్రమాదాలకు గురై మృత్యువాత పడుతున్నారని ఆయా బాధిత కుటుంబాలకు ప్రభుత్వం నుండి అందుతున్న బీమా నామమాత్రంగా ఉంటుందన్నారు. వీరికి గ్రూపు యాక్సిడెంటల్ ఇన్సురెన్స్ చేసేందుకు చర్యలు తీసుకోవలసిందిగా కోరారు. ఈ అంశంపై మంత్రి సాను కూలంగా స్పందిస్తూ ఏఐటీయూసీ నేతలు తెలిపి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ అన్నారు. మంత్రిని కలిసిన వారిలో ఏఐటీయూసీ విజయవాడ నగర ప్రధాన కార్యదర్శి మూలి సాంబశివరావు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నగర ప్రధాన కార్యదర్శి బుద్దె రాజా, రాష్ట్ర నాయకులు తెడ్డు వెంకటేశ్వరరావు ఉన్నారు.

ప్రజా సమస్యలపై కమ్యూనిస్టుల పోరాటం

100 వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా అన్ని పార్టీ శాఖలలో అరుణ పతాకాలు ఆవిష్కరించాలని, పార్టీ చరిత్రను అమరజీవుల, పార్టీ ఆశయాలను సమావేశాలలో కార్యకర్తలకు బోధించాలని ఆయన తెలిపారు. గత 100 సంవత్సరాలలో సిపిఐ భారత దేశంలో పేద ప్రజలు బడుగు బలహీన వర్గాలు కార్మికులు కర్షకులు రైతాంగ హక్కుల కొరకు వారి సమస్యలపై అలుపెరగని పోరాటాలు చేసిందని అనేక విజయాలు సాధించిందని అన్నారు. సెంటు కుంటలేని నిరుపేద రైతాంగానికి పేద ప్రజలకు ఇళ్ల స్థలాలు బంజరు భూములు లక్షలాది ఎకరాలు పంపిణీ చేయడం జరిగిందని అన్నారు. పట్టణ కార్యదర్శి ఉలవలపూడి రాము, మాజీ వైస్ చైర్మన్ తదితరులు మాట్లాడుతూ పార్టీ ఇచ్చిన పిలుపులను అమలు చేస్తు శాఖల సమావేశాలు నిర్వహిస్తున్నామని పార్టీ సభ్యత్వం కార్యక్రమం పూర్తి చేస్తామని ఇళ్ల స్థలాల సమస్యలపై కరపత్రాలు పంపిణీ చేస్తూ అర్జీలు పెట్టించడం పూర్తి చేస్తామని ఉచిత ఇసుక కరెంటు సమస్యలపై పోరాట కార్యక్రమాలను పొందించుకొని పూర్తి చేయాల్సి ఉందని అన్నారు. ఈ సమావేశంలో సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు, సిపిఐ నాయకులు షేక్ కిషోర్, కొండముట్ల సుభాని, షేక్ మస్తాన్, కొప్పురపు మల్లికార్జునరావు, బల్లే పల్లి పద్మ, రమణ, సువార్త, ఆంజనేయులు, పొట్లూరి వెంకటేశ్వర్లు, రామారావు, కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించాలి

సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు అనుమతులు లేకుండా విధులకు గైరుహాజరు అవుతున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. నిబంధనలకు విరుద్ధంగా విధులకు హాజరుకాని ఉద్యోగులపై సంబంధిత శాఖలకు చర్యలకు సిఫార్సు చేయాలన్నారు. జిల్లాలో హౌసింగ్ లే అవుట్లలో ఇళ్ల నిర్మాణాలు, స్టేజ్ కన్వర్షన్లు వేగవంతం అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. బాలల దినోత్సవం నాటికి అంగన్వాడీ కేంద్రాలలో మంజూరు చేసిన పనులన్ని పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలన్నారు. పోషణ వాటిక, రెయిన్ వాటర్ హార్వేస్టింగ్ స్ట్రక్చర్ల నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలన్నారు. విద్యార్థులకు అపార్ ఐడీలు క్రియేట్ చేసేందుకు విద్యాశాఖ అధికారులను సమన్వయం చేసుకుంటూ పట్టణాల్లో కమిషనర్లు, గ్రామీణ ప్రాంతాల్లో ఎంపీడీవోలు ప్రణాళికా ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. మండల స్థాయిలో జరిగే అభివృద్ధి కార్యక్రమాలను సంబంధిత మండలస్థాయి అధికారులను సమన్వయం చేసుకుంటూ ప్రత్యేక అధికారులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. సమావేశంలో జిల్లా పరిషత్ సీఈఓ జ్యోతిబసు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రబీలో రైతులకు పెట్టుబడి సాయం చేయండి

విశాలాంధ్ర-విజయవాడ: రబీ సీజన్ ప్రారంభం అయిన నేపథ్యంలో ప్రతి రైతు, కౌలు రైతులకు అన్నదాన సుఖీభవ పథకం కింద రూ.20వేలు పెట్టుబడి సాయం అందించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్నీడి యల్లమందారావు అన్నార. ఈ మేరకు రైతు సంఘం ఎన్టీఆర్ జిల్లా నాయకులు ఇబ్రహీపట్నం మండల తహసీల్దార్ వై.వెంకటేశ్వర్లుకి సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యల్లమందారావు మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా రూ.20వేలు పెట్టుబడి సాయం అందిస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చాలని కోరారు. కోస్తా జిల్లాల్లో భారీవర్షాలు, వరదలతో ఖరీఫ్ సీన్‌లో రైతాంగం తీవ్రంగా నష్టపోయిందన్నారు. రబీ సీజన్‌లో పెట్టుబడి కోసం రైతులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ప్రస్తుత రబీ సీజన్‌లో రైతులు సాగు చేస్తున్న పంటలన్నీంటికి రాష్ట్ర ప్రభుత్వం పంటల బీమా ప్రీమియం చెల్లించాలి ఆదుకోవాలన్నారు. రైతుల ఆత్మహత్యల నివారణకు కేరళ ప్రభుత్వం తీసుకువచ్చిన రుణ ఉపశమన చట్టంను పార్లమెంటులో ఆమోదించి, మన రాష్ట్రంలో కూడా అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌలు రైతు సంఘం అధ్యక్షుడు బుద్ది రమేష్, జిల్లా రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పి.హరికృష్ణ, రైతు నాయకులు జొన్నల గడ్డ కోటేశ్వరరావు, మల్నీడి గోవిందరావు, ఎం.చెన్నయ్య, ఆక్వా రైతు సంఘం నాయకులు కన్నా వెంకటేశ్వరరావు, ఎం.రవి, ఆర్.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి సహకరించండి

మాట్లాడుతూ గతంలో ఫిర్యాదు చేసిన సందర్భంగా విద్యుత్ మీటరు, అసెస్మెంట్ నెంబరు తొలగించారని, మరల ఆక్రమణకు గురైందని అన్నారు. ఎన్నో సంవత్సరాలుగా పోరాటాలు చేస్తున్నా వడ్డెర ప్రజల కోసం సీపీఐ బలంగా నిలబడుతుందని తెలిపారు. వడ్డెర కమ్యూనిటీ స్థలాన్ని రక్షించేంతవరకు సీపీఐ వారికి అండగా ఉంటుందని మాల్యాద్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు చల్లా మరియదాసు, ధూపాటి రత్నం, సాంబశివరావు, సిహెచ్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల అర్జీలను సకాలంలో పరిష్కరించాలి

స్వీకరించారు. ప్రజల సమస్యలను జిల్లా కలెక్టర్ ఆలకించి సంబంధిత అధికారులను పిలిపించి సమస్యల వివరాలను తెలుసుకొని సానుకూలంగా పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ సంస్థ పిడి వెంకట్రావు, పౌరసరఫరాల డీఎం సృజన, మత్స్యశాఖ జెడి. చంద్రశేఖర్, డిటిఇడబ్ల్యూ పణి దూర్జటి, పర్యాటక అధికారి రామ్‌లక్ష్మణ్, రహదారులు, భవనాల శాఖ ఈఈ లోకేష్, ఉద్యాన అధికారి జ్యోతి, ఏపిఎంఐపి పిడి విజయలక్ష్మీ, డిపిఓ అరుణ, సర్వే రికార్డుల ఏడి జోషిలా, మార్కెటింగ్ ఏడి నిత్యానందం, డీఎంహెచ్ఓ డా. గీతాబాయి తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

భవానీ దీక్షల స్వీకరణ ప్రారంభం

విశాలాంధ్ర-విజయవాడ (ఇంద్రకీలాద్రి): విజయవాడ ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో భవానీ దీక్షలు ప్రారంభమైయ్యాయి. ఆలయ ఈవో కే.రామారావు అధికారికంగా దీక్షలు ప్రారంభించారు.ఈ సందర్భంగా కే.రామారావు మాట్లాడుతూ లోక కళ్యాణార్థమై శ్రీక్రోధినామ సంవత్సర భవానీ దీక్షలు ప్రారంభించినట్లు తెలిపారు. నవంబర్ 11వతేదీ నుంచి డిసెంబర్ 25వతేదీ వరకు భవానీదీక్షలు కొనసాగనున్నాయన్నారు. కార్తీక శుద్ధ దశమి, ఏకాదశి రోజున ఉదయం 7గంటల భవానీ మండల దీక్షాధారణలు ప్రారంభించమని చెప్పారు. ఈనెల 15వతేదీ కార్తీక పూర్ణిమ రోజున శ్రీ భవానీ మండల దీక్షాధారణ ముగిస్తాయన్నారు. డిసెంబర్ 1వతేదీన భవానీ అర్ధ మండల దీక్షాధారణలు ప్రారంభమవుతాయని చెప్పారు. డిసెంబర్ 5వతేదీ వరకు శ్రీ భవానీ అర్ధ మండల దీక్షాధారణలు ముగుస్తుంది. డిసెంబర్ 14వతేదీ మార్గశిర పూర్ణిమ రోజు కలశ జ్యోతి ఉత్సవం, శ్రీశృంగేరి శారదా పీఠం పరిపాలిత శ్రీ శివరామకృష్ణ క్షేత్రం(రామకోటి) సత్యనారాయణ పురం నుంచి సాయంత్రం 6 గంటలకు బయలుదేరి నగరోత్సవముగా శ్రీ అమ్మవారి దేవస్థానంకు చేరుకుంటుంది. డిసెంబర్ 21వతేదీ నుంచి 25వతేదీ వరకు దీక్ష విరమణలు ఉండనున్నాయి.

కానూరులో సిద్ధార్థ ఫ్లై ఓవర్ ప్రారంభం

విశాలాంధ్ర-విజయవాడ: గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఐదున్నరేళ్ళుగా ప్రారంభానికి నోచుకోని ఫ్లై ఓవర్‌ని కూటమి ప్రభుత్వం వచ్చిన నాలుగు నెలల్లోనే ప్రత్యేక శ్రద్ధ చూపి పూర్తి చేసిన ఫ్లైఓవర్‌ను సోమవారం మంత్రి నారాయణ సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో పెనమలూరు ఎమ్మెల్యేలు బోడే ప్రసాద్, సుజనా చౌదరి, కామినేని శ్రీనివాస్ ,సిద్ధార్థ అకాడమి కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు పాల్గొన్నారు. మంత్రి పి. నారాయణ మాట్లాడుతూ సిద్ధార్థ ఫ్లై ఓవర్‌ను తన చేతుల మీదుగా ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. తాడిగడప మున్సిపాలిటీ లో డ్రైనేజి పరిస్థితి దారుణంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ బోడే ప్రసాద్ విజ్ఞప్తి మేరకు ఫ్లై ఓవర్ నుంచి జాతీయ రహదారికి వెళ్ళే 3.5 కి.మీ రొడ్డును సీఆర్డీయే నిధులతో నిర్మిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

శివకుమారి మరణం మహిళా ఉద్యమానికి తీరని లోటు

విశాలాంధ్ర-విజయవాడ: సీపీఐ 46వ డివిజన్ సభ్యులు, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య డివిజన్ కార్యదర్శి సింగంశెట్టి శివ కుమారి మరణం మహిళా ఉద్యమానికి తీరని లోటని వక్తలు పేర్కొన్నారు. శివకుమారి సంతాప సభ సీపీఐ డివిజన్ కార్యదర్శి కుర్రా శివ కుమార్ అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ సభలో ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెనుమత్స దుర్గాభవానీ, సీపీఐ నగర కార్యదర్శి జి. కోటేశ్వరరావు శివకుమారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. సంతాప సభలో వారు మాట్లాడుతూ శివకుమారి గత 30 సంవత్సరాలుగా పార్టీ కార్యక్రమంలో చురుకుగా పని చేసే వారిని, పార్టీ నిర్వహించే అన్ని కార్యక్రమాలలో పాల్గొన్నారని తెలిపారు. ఆమె కుటుంబం మొత్తం కమ్యూనిస్టు పార్టీలోనే ఉన్నారని చెప్పారు. ఈ సంస్మరణ సభలో నగర మహిళా సమాఖ్య అధ్యక్ష కార్యదర్శులు ఓర్సు భారతి, పంచదార్ల దుర్గాంబ, సీపీఐ కార్యదర్శి వర్గ సభ్యులు తాడి పైడియ్య, కొట్టు రమణా రావు,కార్యవర్గ సభ్యులు డీవీ.రమణ బాబు, డివిజన్ నాయకులు ఎస్వీ.రమణ, ప్రజానాట్య మండలి రాష్ట్ర నాయకులు ఎస్కే నజీర్, ఏఐవైఎఫ్ నగర కార్యదర్శి లంకా గోవింద రాజు తదితరులు పాల్గొన్నారు.

జనసేనలోకి వైసీపీ కార్పొరేటర్లు

విశాలాంధ్ర-విజయవాడ (వన్ టౌన్): వైసీపీకి చెందిన స్థానిక సంస్థల ప్రతినిధులు, సీనియర్ నేతలు జనసేన తీర్థం పుచ్చుకున్నారు. విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ 16వ డివిజన్ కార్పొరేటర్ ఉమ్మడిశెట్టి రాధికతో పాటుపశ్చిమ నియోజకవర్గం నుండి 48వ డివిజన్ కార్పొరేటర్ అత్తులూరి ఆదిలక్ష్మి, 51వ డివిజన్ కార్పొరేటర్ మరుపిళ్ల రాజేష్, 38వ డివిజన్ కార్పొరేటర్ మహాదేవ్ అప్పాజీ జనసేన అధినేత పవన్ కళ్యాణ్ సమక్షంలో పార్టీలో చేరారు.

పబ్లిక్ నోటీసు

నా క్లయింట్ **దోనేపూడి రాజేంద్ర ప్రసాద్, తండ్రి రాధాకృష్ణమూర్తి, డోర్ నెం. 60-2-1B2, గాయత్రి నగర్, విజయవాడ** వారి సంజాయిషీ పొంది యావన్మందికి తెలియచేయునది ఏమనగా...

నా క్లయింట్‌కు కృష్ణాజిల్లా, పెనమలూరు మండలములోని పోరంకి గ్రామములో కల స్థలముపై లోను నిమిత్తం, స్థలము యొక్క దస్తావేజులను ఫోటోస్టాట్ తీయించుటకు, **06-11-24న ఉ॥ 11.00గం॥లకు** విజయవాడ సూర్యారావుపేట, డోర్నకల్ రోడ్డు మీదుగా సివిల్ కోర్టుల వద్దకు వెళ్ళి చూడగా సదరు స్థలము యొక్క లింకు డాక్యుమెంట్, కంకిపాడు రిజిస్ట్రారు ఆఫీసు దస్తావేజు నెం. **1669/1981, ది. 22-08-1981** ఎక్కడో జారిపడి పోయినట్లుగా గమనించి, వెనక్కి వెళ్ళి చూడగా ఎక్కడా కనపడలేదు. కనుక సదరు లింకు డాక్యుమెంట్ ఎవరికైనా దొరికినయెడల నా క్లయింట్‌కుగాని, మాకుగాని అప్పగించ వలసినదిగా కోరటమైనది. సదరు డాక్యుమెంట్‌ను ఉపయోగించి ఎలాంటి అన్యాక్రాంతములు జరిపిన మేము తీసుకొను చర్యలకు బాధ్యులుగుదురని తెలియ చేయటమైనది.

సి. హెచ్. అజయ్‌కుమార్, బి.కామ్., బి.ఎల్., అడ్వకేట్, సూర్యారావుపేట, విజయవాడ-2 సెల్ : 9848128444

కృష్ణానదిలోకి దూసుకెళ్లిన కారు

ఇద్దరికీ తీవ్రగాయాలు

విశాలాంధ్ర-చల్లపల్లి : కృష్ణానది కరకట్టపై కారు అదుపుతప్పి నది వైపు దూసుకుపోయింది. ఆదివారం అర్ధరాత్రి ఘంటసాల మండలం పాపవినాశనం ఆశ్రమం సమీపంలోని మలుపులో ఈ ఘటన జరిగింది. విజయవాడకు చెందిన సయ్యద్ కలీం, సయ్యద్ అలీ దాదా, షేక్ మెహబూబ్ కారులో చల్లపల్లి వచ్చి తిరిగి వెళుతుండగా ప్రమాదానికి గురయ్యారు. దారిన పోయే వాహనదారులు ప్రమాదాన్ని గమనించి 108కు సమాచారం అందించారు. చల్లపల్లి నుంచి 108 సిబ్బంది ఈఎంటీ బంద్రపల్లి అశ్వని, పైలట్ అబ్దుల్ షఫీ ఘటన స్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఘటన స్థలిలో తిరగబడి నుజ్జునుజ్జయిన కారులో సయ్యద్ అలీదాదాకు తీవ్ర గాయాలై రెండు చేతులు విరిగాయి. సయ్యద్ కలీం తలకు గాయమైంది. మెహబూబ్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. కారు కట్ట కింద నదిలో దాదాపు పదిహేను అడుగుల లోతులో ఉండటంతో క్షతగాత్రులను పైకి చేర్చేందుకు పైలట్ అబ్దుల్ షఫీ తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. తీవ్ర గాయాలకు గురైన అలీదాదాను ఏటవాలుగా ముళ్ల పొదలతో ఉన్న కరకట్టపైకి చేర్చటం అసాధ్యం కావటంతో పైలట్ షఫీ అతనిని స్కూప్ పై పడుకోబెట్టి తాళ్లతో కట్టి స్థానికుల సహకారంతో తీవ్రంగా శ్రమించి రోడ్డు పైకి చేర్చాల్సి వచ్చింది. అంబులెన్సు ఈఎంటీ అశ్వని కుమారి తక్షణ చికిత్స అందించిన అనంతరం అతనిని బంధువులు ప్రైవేట్ వాహనంలో విజయవాడ ఆసుపత్రికి తరలించారు. స్వల్ప గాయలకు గురైన సయ్యద్ కలీంను అంబులెన్సులో చల్లపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

శాంతిభద్రతల రక్షణకు ప్రత్యేక చర్యలు

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: తిరువూరు డివిజన్‌లో క్షేత్రస్థాయిలో శాంతిభద్రతలను కాపాడేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని మైలవరం ఏసీపీ ప్రసాదరావు అన్నారు. విస్సన్నపేట పోలీస్‌స్టేషన్‌ను ఆయన సోమవారం పరిశీలించారు. పోలీసుశాఖ సమకూర్చుకున్న నూతన బ్యారికేడ్లను ఆయన ప్రారంభించారు. తిరువూరు సీఐ గిరిబాబు, ఎస్ఐ రామకృష్ణ ఉన్నారు.

అక్రమ మద్యం అమ్ముతున్న వ్యక్తి అరెస్ట్.

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వ మండలంపెద ముత్తేవి గ్రామ సెంటర్ వద్ద అక్రమంగా మద్యం అమ్ముతున్న వ్యక్తిని మద్యం సీసాలతో సహా అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేసినట్లు కూచిపూడి ఎస్సై ఎం

సుబ్రహ్మణ్యం తెలిపారు. పోలీస్‌స్టేషనుకు వచ్చిన సమాచారంతో ఆదివారం రాత్రి సిబ్బందితో కలిసి నిర్వహించిన దాడిలో దండాబత్తిన నాగేంద్ర బాబు దుకాణంపై దాడిచేసి అతని వద్ద ఉన్న 30 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సోమవారం తెలిపారు.

మా భూములను మరలా రీ సర్వే చేయండి

విశాలాంధ్ర- కంచికచర్ల: వీరులపాడు మండలంలోని గూడెం మాధవరంలో రీ సర్వే పై సోమవారం అధికారులు గ్రామ సభ నిర్వహించారు. గ్రామసభలో భాగంగా 2023 వ సంవత్సరం చేసిన రీ సర్వేలో గ్రామస్తుల భూములకు సంబంధించినవి తప్పులుగా రీ సర్వే చేసి ఉన్నారు. ఈ రీ సర్వేతో రైతులు తీవ్రంగా నష్టపోయారని సర్వే తప్పులు తడకగా ఉందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు ఫీల్డ్‌కు వెళ్లకుండా పంచాయతీ కార్యాలయంలో కూర్చొని వారి ఇష్టారాజ్యంగా కొలతలు వేసారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక్కొక్క ఎకరానికి నాలుగు సెంట్లు నుండి పది సెంట్లు వరకు తేడా వచ్చిందని ఉన్న దాని కన్నా ఎక్కువ ఎలా వస్తుందని వేరొకరికి ఎలా తగ్గుతుందని అధికారులను గ్రామస్తులు నిలదీశారు. బాధితులు భూమి ఎందుకు తగ్గింది అని సర్వేయర్ ను అడిగితే మాకు ఐదు సెంట్లు వరకు పర్మిషన్ ఉందని అన్నారని రైతులు వాపోతున్నారు. కావున అధికారులు స్పందించి మరల సక్రమంగా రీ సర్వే చేసి పాస్ పుస్తకాలను అందజేయాలని గ్రామంలోని రైతులు సంతకాలు చేసి అర్జీ ని అధికారులకు అందజేశారు.

అర్జీలు సత్వరమే పరిష్కరించండి

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే అర్జీల సత్వర పరిష్కారానికి కృషి చేయాలని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ డా.నిధిమీనా సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీలపై అధికారులు ప్రత్యేక దృష్టిపెట్టి అర్జీదారులు సంతృప్తి చెందేలా ప్రతి సమస్యను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా నలుమూలల నుంచి రూ.123 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల

జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రతి ఫిర్యాదును పరిశీలించాలి : కమిషనర్

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చే ప్రతి ఒక్క ఫిర్యాదును శాఖాధిపతులే స్వయంగా ఫీల్డ్‌లోకి వెళ్లి పరిశీలించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో కమిషనర్ సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించి ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అత్యధికంగా ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్ విభాగాల్లో నాలుగు ఫిర్యాదులు అందగా, ప్రజా ఆరోగ్యంలో మూడు, రెవెన్యూలో రెండు మొత్తంగా 13 ఫిర్యాదులు స్వీకరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ డాక్టర్ డీ.చంద్రశేఖర్, చీఫ్ సిటీ ప్లానర్ ప్రసాద్, డిప్యూటీ కమిషనర్ జి.సృజన, ఇన్‌చార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, సూపరిండెంటింగ్ ఇంజనీర్లు పీ.సత్యనారాయణ, పి.సత్యనారాయణకుమారి, అమృత పతకం జేడీ, తదితరులు పాల్గొన్నారు.

20 బైకులు స్వాధీనం

విశాలాంధ్ర-విజయవాడ (క్రైం): బైక్ చోరీ కేసులో నిందితుడిని కృష్ణలంక పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. సౌత్ ఏసీపీ బంగారురాజు చోరీ కేసులోని వివరాలను వెల్లడించారు. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం రాయలం గ్రామానికి చెందిన నంద్యాల రామకృష్ణ(50) సీసీ రోడ్లు కాంట్రాక్ట్ పనులు చేస్తుంటాడు. చెడు వ్యసనాలకు అలవాటుపడి తన మూడు సొంత వాహనాలను తాకట్టు పెట్టాడు. జల్సాలకు డబ్బులు లేకపోవడంతో బైక్ చోరీలు చేసి అమ్మే డబ్బులతో జల్సాలు చేయాలని నిర్ణయించుకున్నాడు. ఈ ఏడాది మార్చి నెలలో భీమవరం నుంచి విజయవాడ వచ్చి బస్టాండ్ సమీపంలో పార్క్ చేసి ఉన్న ద్విచక్రవాహనంను చోరీ చేశాడు. ఈ విధంగా నగరంలో కృష్ణలంక, సూర్యారావుపేట, సత్యనారాయణపురం పోలీస్ స్టేషన్ పరిధిలో 20 బైకులను దొంగతనాలు చేశాడు. ఒక్కసారిగా బైకులు అమ్మకాలు చేస్తే అధిక డబ్బులు వస్తాయని చోరీ చేసిన బైకులను వారధి డౌన్‌లో ఉన్న పాబుపడిన భవనంలో ఉంచాడు. ఈనెల 10వతేదీన బస్టాండ్ సమీపంలో మరో వాహనం చోరీ చేసి వెళ్తున్న సమయంలో నల్లగేటు సమీపంలో పోలీసుల తనిఖీల్లో పట్టుబడ్డాడు. ఈక్రమంలో అతని అదుపులోకి తీసుకుని 20 బైకులను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. కేసులో కీలకంగా వ్యవహరించిన కృష్ణలంక ఎస్సై ఏ.సూర్యనారాయణ, క్రైమ్ హెడ్ కానిస్టేబుల్స్ జి.సాంబయ్య, జి.ప్రవీణ్‌కుమార్, కానిస్టేబుల్ కే.బాబూరావులను పోలీస్ కమిషనర్ రాజశేఖరబాబు అభినందించారు. ఈ సమావేశంలో కృష్ణలంక సీఐ నాగరాజు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసు 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో 66 ఫిర్యాదులు

విశాలాంధ్ర-విజయవాడ (క్రైం): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 66 ఫిర్యాదులు అందాయి. పోలీస్ కమిషనర్ ఎస్వీ.రాజశేఖరబాబు ఆదేశాల మేరకు కమిషనరేట్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. డీసీపీలు ఏబీటీఎస్ ఉదయరాణి, కృష్ణమూర్తి నాయుడు బాధితుల నుంచి ఫిర్యాదు స్వీకరించారు. నగదు లావాదేవీలకు సంబంధించినవి 9, భార్యాభర్తలు, కుటుంబ కలహాలకు 6, భూవివాదాలకు 7, వివిధ మోసాలకు సంబంధించినవి 15, వేధింపులకు 7, దొంగతనాలకు 5, ఇతర చిన్న చిన్న వివాదాలు సమస్యలకు, సంఘటనలకు 17, మొత్తం 66 ఫిర్యాదులు అందాయి. ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కాజలో సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వ మండలం కాజలో సమస్యల పరిష్కరించాలంటూ గ్రామస్తులు సోమవారం ప్రజా సమస్యల వేదిక (మీకోసం) లో అర్జీ దాఖలు చేశారు. అయినంపూడి డ్రైన్ పై శిథిలావస్థలో గల బెయిలీ(ఇనప)బ్రిడ్జిని సత్వరమే అభివృద్ధి పరచాలని, అలాగే గుంటలమయంగామారిన ఎంఎం పల్లె రహదారి అభివృద్ధి పరచాలని, గ్రామస్తులు ఎదుర్కొంటున్న కోతుల బెడద తొలగించాలని, కాజనుంచికోళ్ల పాలెం వెళ్లే ఆర్ అండ్ బి రహదారి అభివృద్ధి పరచాలని, అయినంపూడి డ్రైన్ లో గుర్రపుడెక్క తొలగించాలని, గ్రామంలోని రహదారులను అభివృద్ధి పరచాలని కోరుతూ గ్రేడ్ 5 కార్యదర్శికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్.మురహరి రెడ్డి, దగానిరాయప్ప, కలపాలలాజర్,కే కరుణాకర రావు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ విద్యా దినోత్సవం

విశాలాంధ్ర-కూచిపూడి : కృష్ణా విశ్వవిద్యాలయం పరిధిలోని మొవ్వ వి ఎస్ ఆర్ ప్రభుత్వ డిగ్రీ మరియు పీజీ కళాశాలలో సోమవారం జాతీయ విద్యా దినోత్సవం వేడుకలను నిర్వహించారు. అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ మాధవి మాట్లాడుతూ భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రిగా కొనసాగిన మౌలానా అబుల్ కలాం ఆజాద్ గొప్ప విద్యావంతులుగా అభివర్ణిస్తూ ఆయన మార్గ దినోత్సవం పురస్కరించుకొని 2008 వ సంవత్సరం నుంచి నుంచి నవంబర్ 11వ తేదీన జాతీయ విద్యా దినోత్సవం గా నిర్వహిస్తూ విశేష సేవలు అందించిన గురువులను సత్కరించే ఆనవాయితీని కొనసాగించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఆ శాఖ అధ్యాపకులు డాక్టర్ ఎం సుందరరావు, బి శివ నాగేశ్వరరావు, డాక్టర్ సిహెచ్ ఆనందకుమార్, డాక్టర్ కే వెంకటేశ్వర్లు, సంకుల కిరణ్మయి, వై సునీత, రత్న మేరీ లతోపాటు విద్యార్థి కే కృష్ణకుమార్ పాల్గొని జాతీయ విద్యా దినోత్సవం ప్రాధాన్యతను ప్రాముఖ్యతను వివరించారు.

నేతన్న విగ్రహానికి అనుమతివ్వండి

విశాలాంధ్ర-పెడన: పెడన పట్టణంలో ఆల్ ఇండియా వివర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నేతన్న విగ్రహాన్ని ప్రతిష్ఠించడానికి అనువైన స్థలం మరియు అనుమతి ఇప్పించాలని కోరుతూ మున్సిపల్ చైర్ పర్సన్ కటకం నాగకుమారి, కమిషనర్ మన్నెం గోపాలరావు సోమవారం చైర్‌పర్సన్ సాంబార్లో వినతి పత్రం అందజేశారు. అధ్యక్షులు పిచ్చుక ఫణి కుమార్, తాళ్ల బాలాజీ, బల్ల సాంబశివరావు, 18 వ వార్డు వైసీపీ ఇంచార్జ్ కోమట్ల అనిల్ కుమార్ 19 వ వార్డు కౌన్సిలర్ సిరివెళ్ల జై ఏసు పాల్గొన్నారు

పంచాయతీలకు మహర్దశ: ఎంపీడీవో

విశాలాంధ్ర-పెదపారుపూడి : రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీలను అభివృద్ధి చేయడానికి ఒక ప్రణాళిక బద్ధమైన ఆలోచనతో ముందుకెళ్లటానికి స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో మంగళ, బుధవారాలలో రెండు రోజులపాటు ప్రజాప్రతినిధులకు, సంబంధిత అధికారులకు శిక్షణ ఇవ్వనున్నట్లు ఎంపీడీవో టి సీతామహాలక్ష్మి తన కార్యాలయంలో సోమవారం తెలిపారు.

జిల్లా వినియోగదారులు వివాదాల పరిష్కార కమిషన్, కృష్ణా, విజయవాడ

సి.సి. నెం. 245/2023

పిటీషన్ :

బట్టు నవీన్ - కంప్లయినెంట్

మరియు

1.సాహితి ఇన్ఫ్రాటెక్ ఎల్.ఎల్.పి. హైదరాబాద్, రిప్ బై ఆథరైజ్డ్ సిగ్నేటరి బి.లక్ష్మీ నారాయణ
2. వల్లూరు బసవయ్య చౌదరి
3. వల్లూరు కేశవ్, 4. వల్లూరు సరోజ
5. వల్లూరు ఉమాదేవి - ఆపోజిట్ పార్టీస్

పై నంబరు కేసులో మీరు 3,4 నెం. ఆపోజిట్ పార్టీలు అయి ఉన్నారు. పై నెంబర్ కేసులు నోటీసు నిమిత్తమై ది. 13-12-2024న వాయిదా వున్నది సదరు వాయిదా రోజున మీరు స్వయంగా గానీ, వకీలుగారి ద్వారా గానీ పై కమీషన్ వారి ఎదుట ఉదయం 10-30 గం. లకు హాజరై ఆక్షేపణలు వున్న యెడల తెలియపరచు కొనగలరు. లేనిచో మీ పరోక్షముగా తీర్మానించబడును.

(శ్రీ కమీషన్ వారి ఉత్తర్వుల ప్రకారం)

వాయిదా : 13-12-2024

చందు హర్షవర్ధన్,
కంప్లయినెంట్ తరపు అడ్వకేట్,
విజయవాడ. సెల్: 9908353699

రైతుల హామీలు అమలు చేయాలి

విశాలాంధ్ర-చల్లపల్లి : కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైతులకు పెట్టుబడి సహాయం అందిస్తామని ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలనీ ఏపీ రైతుసంఘం జిల్లా నాయకులు హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ, గుత్తికొండ రామరావు డిమాండ్ చేసారు. ఈ మేరకు చల్లపల్లి తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీ లత కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సురేంద్రనాథ్ బెనర్జీ, రామారావు లు మాట్లాడుతూ 2024 ఎన్నికల సందర్భంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రతి రైతుకు రూ.20వేలు పెట్టుబడిసాయం అందిస్తామని హామీ ఇచ్చారని, హామీ అమలు చేయాల్సిన విషయాన్నీ మర్చిపోయారని విమర్శించారు. అధికారం చేపట్టినాకా రైతులకు సహాయం అందించేందుకు ఎందుకు జాప్యం చేస్తున్నారని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం రైతులకు ఇచ్చిన ఒకే ఒక్క హామీని కూడా అమలు చేయడం లో నిమ్మకు నీరెట్టినట్టు వ్యవహరించడం తగదన్నారు. గత ప్రభుత్వ విధానాలవల్ల మన రాష్ట్రంలో ప్రతి రైతుకుటుంబంపై సుమారు 2 లక్షల 45 వేల రుణ భారం పడిందని పేర్కొన్నారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్ లో రాయలసీమ జిల్లాల్లో కరువు పరిస్థితి తాండవిస్తుంటే మరో ప్రక్క కోస్తా తీర ప్రాంత జిల్లాల్లో భారీ వర్షాలు, వరదలు ముంచెత్తి రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ఖరీఫ్ సీజన్లో సుమారు 12 లక్షల ఎకరాల్లో రైతాంగం పంటలు వేయలేకపోయారని ఆవేదన వెలిబుచ్చారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ముగిసిందని,రబీ సీజన్ ప్రారంభమై రైతులు పెట్టుబడికోసం ఎదురుచూస్తున్న దశలో ప్రభుత్వం ప్రకటించిన రైతుకు రూ.20 వేలు పెట్టుబడిసాయం ఇచ్చి ఆదుకోవాలని కోరారు. రబీ సీజన్లో రైతాంగం సాగు చేస్తున్న పంటలన్నింటికి రాష్ట్ర ప్రభుత్వం పంటల భీమా సొమ్ము ప్రభుత్వమే కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్ బాబు, రైతు నాయకులు వేమూరి రత్నగిరి రావు, మల్లుపెద్ది బోసు, చంద్ర సుబ్బారావు, దాసరి గోపాల కృష్ణ, సీపీఐ నాయకులు పెనుమత్స ప్రభాకరరావు, నక్కా శ్రీను, నాగమల్లి ఆర్ ఎం పి శేషు పాల్గొన్నారు.

రైతులకు పెట్టుబడి సాయం చేయాలి

విశాలాంధ్ర-గన్నవరం : ఎన్నికలలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీమేరకు రైతుకు పెట్టుబడి సాయం కింద రూ.20 వేలు రైతుకు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని గన్నవరం నియోజకవర్గ రైతు సంఘం కార్యదర్శి కాట్రగడ్డ రామచంద్ర జోషి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం రాష్ట్ర రైతు సంఘం పిలుపుమేరకు గన్నవరం తహశీల్దార్ శివయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రామచంద్ర జోషి మాట్లాడుతూ రాష్ట్రంలో ఐదేళ్లుగా సాగునీటి ప్రాజెక్టులు అట్టకెక్కించారని సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేయాలిని డిమాండ్ చేశారు. వెనుకబడిన ప్రాంతాల ఉత్తరాంధ్ర రాయలసీమ జిల్లాలతో పాటు పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయడానికి నిధులు కేటాయించాలని, రాష్ట్రంలో 40 వేల పైగా చెరువులు అక్రమాలకు గురై కనీసం మరమతులకు నోచుకోలేదని చెరువులు పునర్జీవనానికి దృష్టి సారించాలని అలాగే 32, విద్యార్థులు బలిదానం ప్రజా ప్రతినిధులు రాజీనామాతో సాధించుకున్న ఉక్కు ఫ్యాక్టరీ నీ ప్రైవేట్ పరం చేయకుండా ఉండేందుకు కేంద్ర ప్రభుత్వంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తీసుకురావాలని పలు జిల్లాలో సేజ్ పేరుతో పరిశ్రమలు పేరుతో ప్రాజెక్టుల కోసం రైతుల దగ్గర నుండి తీసుకున్న భూమిని నిరుపయోగంగా ఉన్న భూములను రైతులకు తిరిగి అప్పగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గన్నవరం నియోజకవర్గ రైతు సంఘం కార్యదర్శి కాట్రగడ్డ రామచంద్ర జోషి వెంగళ్ళ శివయ్య. వెంగళ్ల రంగారావు, కట్టవరపు విజయరావు, కట్టవరపు మోహన్ రావు ,నూతక్కి మోహన్ రావు ,చాగంటి పాటి భవానీ ప్రసాద్ ,రేపల్లి రాజేష్, చాగంటి వెంకటేశ్వరావు ,కట్టవరపు బెనర్జీ తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలి

విశాలాంధ్ర- కంచికచర్ల: రైతులకు ఇచ్చిన హామీలను ఎన్డీఏ కూటమి ప్రభుత్వం విస్మరించిందని ఎన్టీఆర్ జిల్లా రైతు సంఘం కార్యదర్శి చుండూరి సుబ్బారావు అన్నారు. స్థానిక ఎంఆర్ ఎంఆర్ఓ సురేష్‌బాబుకి రైతు సమస్యలపై వినతి పత్రం ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2024 ఎన్నికల సందర్భంగా కూటమి ప్రభుత్వం

అధికారంలోకి వస్తే ప్రతి రైతుకు 20 వేల పెట్టుబడి సాయం అందిస్తామని ప్రకటించారు. గత ప్రభుత్వ విధానాల వల్ల మన రాష్ట్రంలో ప్రతి రైతు కుటుంబం పై సుమారు రెండు లక్షల 45 వేల రూపాయల బకాయి ఉందన్నారు. రైతాంగం సాగుచేస్తున్న పంటలన్నిటికీ రాష్ట్ర ప్రభుత్వం పంటల బీమా సొమ్ము ప్రభుత్వం మే భరించి రైతాంగాన్ని ఆదుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నందిగామ నియోజకవర్గం సహాయ కార్యదర్శి కట్టా చామంతి, మండల కార్యదర్శి మన్నే హనుమంతరావు, నియోజకవర్గ కార్యదర్శి జిల్లేపల్లి తుఫాన్ బాబు, ప్రభాకర్, రామయ్య పలువురు రైతులు పాల్గొన్నారు.

జుజ్జూరు రోడ్డుకు మరమ్మతులు

విశాలాంధ్ర-కంచికచర్ల: పట్టణంలోని జుజ్జూరు రోడ్డుకు ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ఆదేశానుసారం తాత్కాలిక మరమ్మతులు చేసినట్లు టిడిపి మండల పార్టీ అధ్యక్షులు కోగంటి బాబు సోమవారం పేర్కొన్నారు. జుజ్జూరు రోడ్డులో ప్రతిరోజు వందలాది మంది వాహనాలతో పాటు పలు గ్రామాల ప్రజలు, వాహనదారులు ప్రయాణించాలంటే ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా మరమ్మతులు చేయించారన్నారు. కోగంటి జెసిబితో పనులను చేపట్టారు. ఈ కార్యక్రమంలో టౌన్ తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు వేమా వెంకట్రావు, టిడిపి మండల పార్టీ ఉపాధ్యక్షులు పంచాయతీ వార్డు మెంబర్ గుత్త ఓంకార్, నన్నపనేని సీతారామరాజు (బుల్లి బాబు), దాసరి రాము, ఐ టి డి పి ప్రదీప్ బూత్ కన్వీనర్ జంపాని రాజేంద్రప్రసాద్ గ్రంధి దుర్గారావు కొండూరు శరత్ నాదెండ్ల కృష్ణ దివ్వెల కోటి పాల్గొన్నారు.

ప్రశ్నిస్తానన్నారు.... ప్రశ్నించరా..?

విశాలాంధ్ర-విజయవాడ(చిట్టినగర్): ప్రశ్నిస్తానంటూ రాజకీయాలకు వచ్చిన పవన్ కళ్యాణ్ కేంద్రాన్ని ఎందుకు ప్రశ్నించ ట్లేదని అమ్ ఆద్మీ పార్టీ సి కోఆర్డినేటర్ నేతి మహేశ్వరరావు ఉద్ఘాటించారు. సోమవారం ప్రెస్ క్లబ్ విలేకరుల సమావేశంలో ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు డేవిడ్ రాజుతో కలిసి మహేశ్వరావు పాల్గొని మాట్లాడుతూ అధికారులను ప్రశ్నిస్తే కేసులు పెడతానని పవన్ అనటం స్థాయిని దిగజారటం కాదా..? ఎర్ర కండువాతో వచ్చి కాషాయం ధరించే స్థితికి దిగజారటానికి ఎవరు కారణం అని ప్రశ్నించారు.

అబ్దుల్ కలాం ఆజాద్ జన్మదినోత్సవం

విశాలాంధ్ర-మచిలీపట్నం : మహనీయులను గుర్తు చేసుకోవడం, దేశం కోసం వారు చేసిన సేవలను స్ఫురించుకోవడం మనందరి

కర్తవ్యం అని మైనార్టీ నాయకురాలు నూర్జహాన్ బేగం తెలిపారు. సోమవారం భారతరత్న స్వతంత్ర భారతదేశ మొట్టమొదటి విద్యా శాఖ మంత్రి మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ జన్మదినమైన జాతీయ విద్యా దినోత్సవాన్ని ముస్లిం మైనారిటీ హెల్పింగ్ హాండ్స్ వారి ఆధ్వర్యంలో స్థానిక నూరి నగర్ లోని బాలుర మదరసా లో జరిగింది. ముఖ్య అతిథిగా మైనారిటీ నాయకులు షైక్. జలీల్ పాల్గొని చిన్నారులకు వాటర్ బాటిల్స్ నీ బహుకరిచటం జరిగినది.మచిలీపట్నం రోటరీ క్లబ్ వారు పిల్లలకి బిస్కెట్స్ పంచగా రియాజ్ హుస్సేన్ మాస్టర్ స్వీట్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ నాయకురాలు నూర్జహాన్ మిత్రబృందం,రోటరీ సభ్యులు మదరసా యాజమాన్యం పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీలకు చల్లపల్లి విద్యార్థిని దివ్య

విశాలాంధ్ర-చల్లపల్లి : వాలీబాల్ జాతీయ స్థాయి పోటీలకు చల్లపల్లి మండలం లక్ష్మీపురం శివారు రామానగరంకు చెందిన కుంచె దివ్య ఎంపికైంది. త్వరలో జరుగనున్న అండర్ 14 జాతీయ వాలీబాల్ పోటీలకు రాష్ట్ర ప్రాబబుల్స్ జట్టులోకి దివ్యను ఎంపికచేశారు. చల్లపల్లి రాజా హైస్కూల్లో దివ్య తొమ్మిదవ తరగతి చదువుతోంది. విజయనగరంలో నిర్వహిస్తున్న సెలక్షన్స్ ద్వారా ప్రాబబుల్స్ జట్టులో స్థానం దక్కించుకుంది.

ఉర్దూ ఉపాధ్యాయిని బేగంకు అవార్డు

విశాలాంధ్ర- పెడన : వీరభద్రపురం ఉర్దూ పాఠశాలలో సెకండరీ గ్రేడ్ ఉర్దూ ఉపాధ్యాయినిగా పనిచేస్తున్న ముంతాజ్ బేగంకి రాష్ట్ర ఉర్దూ అకాడమి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయునిగా 2024-25 విద్యాసంవత్సరానికి ప్రకటించారు. మైనారిటీ సంక్షేమ దినోత్సవం సందర్భంగా విజయవాడలోని తుమ్మలపాలెం కళాక్షేత్రంలో సోమవారం అవార్డు ప్రదానోత్సవంలో ముంతాజ్ బేగం మంత్రి ఎన్. మహమ్మద్ ఫరూక్, మంత్రి సత్యకుమార్‌యాదవ్‌చే అవార్డును అందుకున్నారు.

సేవ్ గర్ల్ చైల్డ్ విజేతలకు బహుమతులు

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య అరోగ్య శాఖ, విద్యాశాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ డా.నిదిమీనా స్థానిక కలెక్టర్ కార్యాలయంలో సోమవారం బహుమతులు అందజేశారు. అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా పీసీపీఎన్‌డీటీ చట్టం అమల్లో భాగంగా సేవ్ గర్ల్ చైల్డ్‌పై వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులతో పాటు ప్రసంశా పత్రాలను అందజేశారు. సీడీ-ఎన్సీడీ, కేన్సర్ స్క్రీనింగ్ సర్వే 3.0లో భాగంగా ముద్రించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమంలో డీఆర్‌వో ఎం.లక్ష్మీనగరసింహం, డీఎంహెచ్‌వో డా.సుహాసిని, ఐసీడీఎస్ పీడీ ఉమాదేవి, డీఎల్‌టీవో డా.ఉషారాణి, డీసీహెచ్ఎస్ డా.బీసీకే నాయక్, ఎన్‌సీడీ-సీగీ పీవో డా.మాధవి నాయుడు, ఎన్‌హెచ్ఎం డీపీఎంవో డా.నవీన్ పాల్గొన్నారు.

గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగపరచుకోండి

విశాలాంధ్ర-మోపిదేవి : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో ప్రతిష్టాత్మకంగా గ చేపట్టిన గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగ పరచుకోవాలని గ్రామ సర్పంచ్ దిడ్ల జానకి రాంబాబు చెప్పారు . సోమవారం మోపిదేవి మండలంలోని కోక్కిలిగడ్డ గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ఉపాధి హామీ గ్రామసభ నిర్వహించారు. గ్రామసభలో భాగంగా ఉపాధి హామీ పథకం టెక్నికల్ అసిస్టెంట్ నాయక్ గ్రామంలో ఇప్పటికే గుర్తించబడిన పనుల వివరాలను తెలియజేశారు. వీటిపై ఉన్న అభ్యంతరాలను తెలియజేస్తూ, ఏమైనా పనులు చేపట్టాల్సి ఉంటే గ్రామసభ దృష్టికి తీసుకురావాల్సిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు . గ్రామ సర్పంచ్ జానకి రాంబాబు మాట్లాడుతూ ప్రభుత్వం మంజూరు చేసిన మినీ గోకులంల నిర్మాణాలు ప్రారంభించి, త్వరితగతిన పూర్తయ్యేలా చూడాల్సిందిగా ఉపాధి హామీ సిబ్బందికి కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు ధీడ్ల రాణి ,కార్యదర్శి వాకా రవికుమార్, సచివాలయ ఉద్యోగులు ,రైతులు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

అమరావతి అభివృద్ధికి కేంద్రం గ్రీన్ సిగ్నల్‌పై హర్షం

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : రాష్ట్ర రాజధాని అమరావతి అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం చొరవచూపడంపై నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కన్వీనర్ జమీల్ అహ్మద్ బేగ్ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. అమరావతి అభివృద్ధిలో భాగంగా ఏపీ సీఆర్‌డీఏ పంపించిన ప్రతిపాదనలను కేంద్ర ఆర్థిక శాఖ ఆమోదం తెలపడం హర్షించదగ్గ విషయమన్నారు. వరల్డ్ బ్యాంక్, ఏషియా డెవలప్‌మెంట్ బ్యాంక్ అందించనున్న రూ.15 వేల కోట్ల రుణం అమరావతి అభివృద్ధి కోసం వినియోగించనున్నట్లు ఏపీ సర్కారు తీసుకున్న నిర్ణయంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు.

కళ్యాణ్‌కు సీపీఐ నివాళి

విశాలాంధ్ర-మంగళగిరి: పట్టణంలోని నాలుగో వార్డుకు చెందిన సీపీఐ సీనియర్ నాయకులు ఇండిగ కళ్యాణ్ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం ఉదయం మృతి చెందారు. ఆయన భౌతికకాయాన్ని సందర్శించిన సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య పార్టీ పతాకాన్ని కప్పి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. నివాళులర్పించిన వారిలో ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని సత్యనారాయణ, దొడ్డి ఈశ్వరరావు, బాపనపల్లి శంకర్రావు, ముక్కంటి, తోట శివ నాగేశ్వరరావు, భూపతి, శ్రీనివాసరావు, నాలుగో వార్డ్ కార్యకర్తలు, నాయకులు ఉన్నారు.

14న విగ్రహాల ఆవిష్కరణ

విశాలాంధ్ర-పెదకాకాని : పెదకాకాని సెంటర్‌లో ఏర్పాటు చేసిన మాజీ ప్రధాన మంత్రులు పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీల విగ్రహాలను ఈ నెల 14న నెహ్రూ జయంతిని పురస్కరించుకొని ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రెడ్డి ఆవిష్కరించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు జొన్నల వెంకటరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు రుద్రరాజు, ఎన్.తులసి రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి ఉషారాణి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు చిలకా విజయ్ కుమార్, లింగంశెట్టి ఈశ్వరరావు, షేక్ మస్తాన్ వలి, కొరివి వినయ్ కుమార్, వివిధ పార్టీల నాయకులు కేవీఎస్ లక్ష్మణరావు, డొక్కా మాణిక్య వరప్రసాద్, రాయపాటి శ్రీనివాస్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ హాజరు కానున్నట్లు వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

13న షెడ్యూల్డ్ తెగల విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : ప్రతిస్పందన ఎడ్యుకేషనల్ అండ్ వెల్ఫేర్ సొసైటీ-చర్ల వారి 17వ వార్షికోత్సవ సందర్భంగా ఈ నెల 13న 'కృష్ణదేవరాయ ఎయిడ్ ఫర్ పూర్ అండ్ అండర్ ప్రివిలేజ్-గుంటూరు', 'ప్రతిస్పందన ఎడ్యుకేషనల్ అండ్ వెల్ఫేర్ సొసైటీ-చర్ల' వారి సంయుక్త ఆధ్వర్యంలో చదువులో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 200 మంది షెడ్యూల్డ్ తెగలకు చెందిన విద్యార్థులకు రూ.7 లక్షల ఉపకార వేతనాలుగా పంపిణీ చేయనున్నారు. ఇందులో రూ.3.25 లక్షలు తులసి సీడ్స్ వారు కృష్ణదేవరాయ ఎయిడ్ ఫర్ పూర్ అండ్ అండర్ ప్రివిలేజ్ ద్వారా షెడ్యూల్డ్ తెగల విద్యార్థులకు అందిస్తున్నారు. ఈ కార్యక్రమం ఉమ్మడి ఖమ్మం జిల్లా, చర్లలోని రాహుల్ విజ్ఞాన్ విద్యాలయంలో ఉదయం 10 గంటలకు ప్రారంభమౌతుంది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తులసి గ్రూప్ చైర్మన్ తులసి రామచంద్ర ప్రభు హాజరై వితరణ చేయనున్నారని తులసి గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ తులసి యోగీష్ తెలియజేశారు.

ఆజాద్ ఆశయాలు ఆదర్శంగా తీసుకోవాలి

జయంతి వేడుకల్లో కలెక్టర్

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : దేశ మొట్టమొదటి విద్యా శాఖ మంత్రిగా పనిచేసిన మౌలానా అబుల్ కలాం ఆజాద్ ప్రతి పేదవానికి విద్య అందించాలనే దూరదృష్టి కలవారని, ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు ఎదగాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీ ఆకాంక్షించారు. కలెక్టరేట్‌లోని డీఆర్సీ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ఆజాద్ 137వ జయంతి వేడుకలలో అసిస్టెంట్ కలెక్టర్ పోవార్ స్వప్నిల్ జగన్నాథ్, డీఈఓ రేణుక, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి మహమ్మద్ షరీఫ్, నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ సజీలతో కలిసి పాల్గొన్నారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ ఆజాద్ స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకొని ప్రతిఒక్కరూ విద్యకు ప్రాధాన్యతనివ్వాలని కోరారు. ముతవల్లిస్ ప్రెసిడెంట్ ఆదం సాహెబ్, ప్రభుత్వ ఖాజీ సిద్దిఖ్, రిటైర్డ్ ప్రభుత్వ అధికారి షరీఫ్ తదితరులు మౌలానా అబుల్ కలాం ఆజాద్ గురించి ప్రసంగించారు. అనంతరం ముగ్గురు ఉత్తమ ఉర్దూ ఉపాధ్యాయులను దుశ్శాలువాతో సత్కరించి, మెమెంటో అందించారు. చదువులో ఉత్తమ ప్రతిభ కనపరచిన పది మంది విద్యార్థు లకు మెమెంటోలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఏపీడీ విజయలక్ష్మీ, ఎంఈఓ ఖాసీం, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ బ్రహ్మయ్య, వక్ఫ్ ఇన్‌స్పెక్టర్ ముక్తియార్ బాషా, మైనారిటీ కార్పొరేషన్ ఈడీ జమీర్ బాషా, ముస్లిం, మైనారిటీ మత పెద్దలు, ఉర్దూ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆచరణాత్మకంగానే విషయపరిజ్ఞానం అలవడుతుంది

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: విద్యార్థులకు ఆచరణాత్మకంగా నేర్పించినప్పుడే ఏ విషయమైనా లోతుగా అర్థమవుతుందని, ఆ దిశగా భాష్యం బ్లూమ్స్ కృషి చేస్తుందని భాష్యం బ్లూమ్స్ జెడ్ ఓ వరలక్ష్మి అన్నారు. సోమవారం భాష్యం బ్లూమ్స్ ఆధ్వర్యంలో గుంటూరుకు చెందిన ఆస్ట్రో విజన్ సంస్థ వారు భాష్యం బ్లూమ్స్ సెకండరీ క్యాంపస్‌లో ప్లానిటోరియం షో ఏర్పాటుచేసి విద్యార్థులకు మన విశ్వం, గ్రహాలు, నక్షత్రాలు వాటి పనితీరు గురించి అవగాహన కల్పించారు. మూడు రోజుల పాటు కెజి నుండి గ్రేడ్ 10 విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఈ షోను ఏర్పాటు చేసినట్లు జెడ్ఓ వరలక్ష్మి తెలిపారు. విద్యార్థులకు ఇటువంటి కార్యక్రమాల ద్వారా విషయపరిజ్ఞానాన్ని పెంపొందించేదుకు కృషిచేస్తున్నామన్నారు. సబ్జెక్టు పరంగా థియరిటికల్ నాలెడ్జ్ పాటు ప్రాక్టికల్ నాలెడ్జను విద్యార్థులకు అందించేందుకు ఈ షో ఎంతగానో సహకరిస్తుందన్నారు. కార్యక్రమంలో భాష్యం బ్లూమ్స్ ప్రైమరీ, సెకండరీ క్యాంపస్ల ప్రిన్సిపాల్స్ కవిత, గిరిజారాణి, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

వైద్య కళాశాలకు యల్లాప్రగడ సుబ్బారావు పేరు హర్షణీయం

+ జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : రాష్ట్ర ప్రభుత్వం ఏలూరు ప్రభుత్వ వైద్య కళాశాలకు కోట్లాది ప్రజల ప్రాణాలను కాపాడే మందులను ఆవిష్కరణలతో అద్భుతాలు సృష్టించి ప్రజల ప్రాణాలను కాపాడిన డాక్టర్ యల్లాప్రగడ సుబ్బారావు పేరును పెట్టడాన్ని జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తంచేశారు. గత ప్రభుత్వాలు బతికున్న రాజకీయ నాయకుల పేర్లు పెట్టడం, ఒకరి పేరే అనేక పథకాలకు పెట్టడానికి స్వస్తి పలికి డొక్కా సీతమ్మ, డాక్టర్ యల్లాప్రగడ సుబ్బారావు లాంటి మహనీయుల పేర్లు పెట్టి భవిష్యత్ తరాలు వారి కృషిని గుర్తు చేసుకుంటూ స్మరించుకోవటానికి అవకాశం కల్పించడాన్ని స్వాగతిస్తున్నట్లు చెప్పారు. డాక్టర్ యల్లాప్రగడ సుబ్బారావు భీమవరంలో పేద కుటుంబంలో జన్మించి, స్వయంకృషితో అమెరికాలోని హార్వర్డ్ యూనివర్సిటీలో వైద్య విద్యను అభ్యసించి క్యాన్సర్, టీబీ, రక్తహీనత, బోధకాలు, టైఫాయిడ్ లాంటి వ్యాధులను పూర్తిగా నిర్మూలించగల మందులను కనుగొన్న మహనీయులు అని ప్రశంసించారు. ఎట్రాజాన్, టెట్రాసైక్లిన్ ఆరియో మైసిన్ లాంటి మందులను కనుగొని ప్రపంచ ప్రజల ఆరోగ్య ప్రమాణాలు మెరుగుదలకు కృషి చేసిన ధన్యజీవి అని, 1947లో అమెరికా పౌరసత్వానికి అర్హత పొందినా జీవితాంతం భారతీయ పౌరునిగా కొనసాగి తన 53వ ఏట 1948 ఆగస్టు 9వ తేదీన అమెరికాలోని న్యూయార్క్‌లో మరణించారన్నారు. పరిశోధకులు, తత్వవేత్త, విద్యావేత్త, దయాగుణాలతో పేరుగాంచిన డాక్టర్ యల్లాప్రగడ సుబ్బారావు పేరును ఏలూరు ప్రభుత్వ వైద్య కళాశాలకు తాను మరణించిన 76 సంవత్సరాల తరువాత డాక్టర్ యల్లాప్రగడ సుబ్బారావు పేరు పెట్టటానికి కృషి చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు అభినందనలు తెలియజేస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

చంద్రబాబు, పవన్ చిత్రపటాలకు పాలాభిషేకం

విశాలాంధ్ర-తాడేపల్లి : మంగళగిరి జనసేన పార్టీ ఇన్‌ఛార్జ్ చిల్లపల్లి శ్రీనివాసరావుకి ఏపీ మెడికల్ సర్వీసెస్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించిన సందర్భంగా జనసేన పార్టీ తాడేపల్లి పట్టణ అధ్యక్షులు అంబటి తిరుపతిరావు ఆధ్వర్యంలో సోమవారం తాడేపల్లి పట్టణ జనసేన పార్టీ కార్యాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. జనసేన పార్టీ తాడేపల్లి మండల కార్యదర్శి మానుకొండ చాముండేశ్వరి దేవి, మండేపూడి మాధవి, జనసేన నాయకులు జొన్న రాజేష్, కాశిమాల దినేష్ చక్రవర్తి, కిలాని మణికంఠ, చల్లా వెంకటేశ్వరరావు, వల్లెపు శివప్రసాద్, వేముల వెంకటేశ్వర్లు, కొలనుకొండ శంకర్, పురంశెట్టి రమేష్, చల్లా వెంకటస్వామి, మద్దే చంద్రశేఖర్ పాల్గొన్నారు.

తైక్వాండో పోటీలకు బాలబాలికలు ఎంపిక

విశాలాంధ్ర-మంగళగిరి : పట్టణంలోని సెయింట్ ఫ్రాన్సిస్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో నాలుగవ ఆత్మకూరు తైక్వాండో అసోసియేషన్ గుంటూరు సబ్ జూనియర్ బాలబాలికల జిల్లా స్థాయి టోర్నమెంట్ జరిగింది. ఈ పోటీలలో మంగళగిరి అమరావతి తైక్వాండో క్లబ్ క్రీడాకారులు పతకాలు సాధించారు. బాలికల విభాగంలో అమిత, మనస్విని బంగారు పతకాలు సాధించగా దివ్య, దేవయానిలు సిల్వర్ మెడల్ సాధించారు. బాలురు విభాగంలో హిమ్మేష్ విజయ సాయి, దనిష్ హుస్సేన్, నిహాల్, ధ్రితిల్, భరద్వాజ్‌లు బంగారు పతకాలు సాధించగా వెంకట సాహిత్, రియాజ్‌లు సిల్వర్ మెడల్, జహీర్, కేతన్‌లు బ్రాంచ్ మెడల్స్ సాధించారు. బంగారు పతకాలు సాధించిన క్రీడాకారులు ఈ నెల 15, 16, 17వ తేదీలలో కందుకూరులో జరగబోయే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని గుంటూరు జిల్లా తైక్వాండో జనరల్ సెక్రెటరీ పడవల సుబ్బారావు తెలియజేశారు. పతకాలు సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు.

స్వర్ణాంధ్రప్రదేశ్ సాధన దిశగా ఏపీ బడ్జెట్: దేగల



విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : స్వర్ణాంధ్రప్రదేశ్ స్థాపనకు అసెంబ్లీలో కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పునాది అని ఏపీ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దేగల ప్రభాకర్ అన్నారు. సోమవారం అర్బన్ టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో దేగల ప్రభాకర్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్ ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుకు అద్దంపట్టే విధంగా ఉందన్నారు. అభివృద్ధి, సంక్షేమంకు ప్రతిబింబంగా ఈ బడ్జెట్ ఉందని, సూపర్ సిక్స్ పథకాల అమలులో భాగంగా మరో రెండు పథకాలైన అమ్మఒడి, ఉచిత బస్సు పథకానికి ఈ బడ్జెట్లో నిధులు కేటాయించడం సంతోషకరమని కొనియాడారు. రాష్ట్రాన్ని అన్నపూర్ణగా మార్చేందుకు నీటిపారుదుల శాఖకు గత ప్రభుత్వం కంటే రెండు రెట్ల అదనపు నిధులు కేటాయించడం రైతుల మోముల్లో ఆనందాలు వెల్లివిరుస్తున్నాయని చెప్పారు. జగన్ పాలన విధ్వంసం నుంచి స్వర్ణాంధ్ర సాధన దిశగా ఏపీ బడ్జెట్ ఉందన్నారు. గత ఐదు సంవత్సరాల పాలనలో జగన్ రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో నెట్టారని దుయ్యబట్టారు. రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో నెట్టిన మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపక్షం అనే మాట ఉచ్చరించే అర్హత లేదన్నారు.

ఆజాద్‌కు జంగా కృష్ణమూర్తి నివాళి

విశాలాంధ్ర-దాచేపల్లి : మౌలానా అబుల్ కలాం ఆజాద్‌కు సోమవారం టీటీడీ పాలకమండలి సభ్యుడు, పల్నాడు బడుగు, బలహీన వర్గాల ఐక్య వేదిక గౌరవాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే జంగా కృష్ణమూర్తి ఘనంగా నివాళులర్పించారు. ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఆజాద్ జయంతి వేడుకలను నిర్వహించారు. ఆజాద్ చిత్రపటంతో పాటు గుర్రం జాషువా, మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జంగా కృష్ణమూర్తి మాట్లాడారు. అదేవిధంగా టీటీడీ పాలకమండలి సభ్యుడుగా నియమితులైన జంగాను ఐక్య వేదిక సభ్యులతో పాటు దళిత, బడుగు, బలహీన వర్గాలకు చెందిన నాయకులు, టీడీపీ శ్రేణులు పలువురు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు 14వ వార్డు కౌన్సిలర్ షేక్ షరీఫ్ అధ్యక్షత వహించారు. జంగా కృష్ణమూర్తి కుమారులు పిడుగురాళ్ల గ్రామీణ జెడ్పీటీసీ సభ్యుడు జంగా కోటయ్య, గామాలపాడు సర్పంచి జంగా సురేష్ జన్మదిన వేడుకలను కూడా నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత గామాలపాడులో అయ్యప్ప స్వాములకు సద్ది కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

బహిరంగ ప్రకటన

గుంటూరు జిల్లా, గుంటూరు రూరల్(మం), ఏటుకూరు, లాలుపురం, భవానీపురం, డోరు.నెం.9-6ఎ/25రు కాపురస్తులు గంపల ఐతంరాజు గారి కుమారుడు గంపల శంకరరావు, (ఆధార్ నెం. 9830 8450 8273) అనే నేను యావన్మందికి తెలియజేయునది ఏమనగా గుంటూరు గ్రామం తాలూకు డి.నెం. 1247రులో యె.0.47 శెంట్లు మింజుమలె చ.గ.322.1/4లు స్థలమును నేను మరియు తోట సుబ్బయ్య గారి కుమారుడు వెంకటేశ్వర్లు మా యిరువురి పేరుతో వున్న ఒరిజినల్ విక్రయ ద.నెం.2007/1987 ది.09.03.1987న యస్.ఆర్.ఒ. గుంటూరు నందు రిజిష్టరు కాబడిన దస్తావేజును తీసుకొని ది.02.11.2024న గుజ్జనగుండ్ల గ్రామములోని నా స్నేహితులకు డాక్యుమెంట్లు చూపించి మరలా ఇంటికి వచ్చు క్రమంలో గుజ్జనగుండ్ల బస్టాండ్ సెంటర్ దగ్గర బస్సు ఎక్కు తొందరలో సదరు డాక్యుమెంట్లు కలిగిన కవరు ఎక్కడో జారిపడిపోయినది. ఆ చుట్టు ప్రక్కల ఎంత వెతికిననూ దొరికియుండలేదు. కావున సదరు పై తెలిపిన ఒరిజినల్ డాక్యుమెంట్లు గల కవరు ఎవరికైనా దొరికిన యెడల నాకు తెచ్చి ఇచ్చిన వారికి తగిన బహుమతి ఇవ్వబడును. అట్లుగాక సదరు డాక్యుమెంట్లను దుర్వినియోగపరిచినయెడల నేను తీసుకొనబోవు చట్టపరమైన సివిల్, క్రిమినల్ చర్యలకు బాధ్యులౌదురు.

గంపల శంకరరావు,
డోరు.నెం.9-6ఎ/25,భవానీపురం, లాలుపురం,
ఏటుకూరు, గుంటూరు రూరల్(మం), సెల్: 9849948417

ప్రతి ఫిర్యాదు పరిష్కరించాలి : కలెక్టర్

విశాలాంధ్ర-నరసరావుపేట: పీజీఆర్ఎస్‌కు వచ్చే ప్రతీ ఫిర్యాదు పరిష్కారం చేయాలని కలెక్టర్ పి.అరుణ్ బాబు ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం కలెక్టర్ అధ్యక్షతన సోమవారం జరిగింది. ప్రజల నుండి వినతులను స్వీకరించారు. జిల్లాలోని సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన 110 మంది అర్జీదారులు తమ వినతులను కలెక్టర్, ఇతర అధికారులకు అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తమ సమస్యలు పరిష్కారం అవుతాయనే నమ్మకంతో నలుమూల ప్రాంతాల నుంచి అర్జీదారులు ఇక్కడకి వస్తుంటారని అన్నారు. అటువంటి వారి సమస్యలను సావధానంగా విని, సత్వర పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

విశాలాంధ్ర-నరసరావుపేట: ఆంధ్రప్రదేశ్ భవన నిర్మాణ కార్మిక సంఘం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కొత్త ఇసుక విధానాన్ని నిరసిస్తూ, భవన నిర్మాణ కార్మికులకు న్యాయం చేయాలని కోరుతూ పల్నాడు జిల్లా కలెక్టర్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న ఇసుక విధానం కార్మికుల పాలిట శాపంగా మారిందని ఈ విధానంలో సెస్, జీఎస్టీ తీసివేశామని నిఘా విభాగం ఉండదని చెప్పటం అక్రమార్కులు సులభతరంగా ఇసుక తరలించుకుపోయే అవకాశం ఉందన్నారు. ఒక్క లారీ ఇసుక గృహ యజమాని కొనాలంటే రూ.36 వేలు ట్రాక్టరు అయితే రూ.7వేల రూపాయలు చెల్లించవలసి వస్తుందని అందువలన యజమానులు ఇసుక కొనలేక నిర్మాణాలు నిలిపివేయడం వలన భవన నిర్మాణ కార్మికులకు చేతినిండా పని లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటూ అర్ధాకలితో అలమటిస్తున్నారన్నారు. ప్రభుత్వమే ఇసుక ర్యాంపులు ఏర్పాటు చేసి గృహ యజమానులకు అందే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. అంతేకాకుండా గత ప్రభుత్వం జీవో నెంబర్ 17ను ప్రవేశపెట్టి సంక్షేమ బోర్డును నిర్వీర్యం చేయటం వలన కార్మికులకు అందవలసిన సంక్షేమ ఫలాలు అందక ఆర్థికంగా చాలా ఇబ్బందులు ఎదుర్కొంటూ ఉన్నారని సంక్షేమ బోర్డును వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న 42, వేల క్లైములకు నిధులు మంజూరు చేయాలని, తక్షణమే ప్రభుత్వం స్పందించి సచివాలయాల ద్వారా బుక్ చేసుకున్న గృహ యజమానులకు 24 గంటల లోపు ఇసుక అందేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వం ఇసుక ఇవ్వటానికి ప్లాను ఉంటేనే ఇసుక ఇస్తామని కొర్రీలు పెడుతూ ఉన్నదని గృహ యజమానికి సులభతరంగా ఇసుక ఇంటికి చేరే విధమైన చర్యలు ప్రభుత్వం వెంటనే చేపట్టాలన్నారు. ఇసుక సులభతరం చేసి గత ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన విధంగా భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని లేని పక్షంలో వచ్చే నెలలో పోరాట పంథా నిర్ణయించుకొని ప్రభుత్వ చర్యలను ఎండగడతామని దుయ్యబట్టారు.

ఈ కార్యక్రమంలో పల్నాడు జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు కాసా సాంబయ్య, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాసా రాంబాబు, అధ్యక్షులు పి.రామారావు, చిలకలూరిపేట ఇంఛార్జి కార్యదర్శి ఎన్.రామ సుబ్బాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణాలు పూర్తి చేయాలి

విశాలాంధ్ర-నూజెండ్ల: పెండింగ్‌లో ఉన్న ఇళ్ళ నిర్మాణా లను త్వరితగతిన పూర్తి చేయాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి పావులూరి ఉమాదేవి, హౌసింగ్ డిఇ శ్రీనివాస్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బందికి సమీక్షా సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమాదేవి మాట్లాడుతూ అసంపూర్తిగా ఉన్న గృహాలు, అసలు మొదలుపెట్టని గృహాలు నిర్మాణాలను నూరు శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో ఆంజనేయరాజు, ఎన్ఆర్ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్స్ భాస్కర్ రెడ్డి, సతీష్ పాల్గొన్నారు.

పేదలకు అండగా సీఎం సహాయనిధి: జీవీ

విశాలాంధ్ర-వినుకొండ : కష్టం ఏదైనా ఆపదల్లో ఉన్న పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన ఈ 5 నెలల వ్యవధిలోనే సీఎం చంద్రబాబు సీఎంఆర్ఎఫ్‌ను తిరిగి పేదల పాలిట సంజీవని, ఆపద్బాంధవుడిగా మార్చాయని కొనియాడారు. వినుకొండ నియోజకవర్గ పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు సోమవారం పంపిణీ చేశారు. అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రుల్లో చికిత్సకోసం సీఎం రిలీఫ్‌ఫండ్‌కు దరఖాస్తు చేసుకున్న 24 మంది లబ్ధిదారులకు రూ.13,30,679 విలువ గల చెక్కులు అందజేశారు. స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే జీవీ, లీలావతి దంపతులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన వారందరికి మంజూరు పత్రాలను అందించారు. అనంతరం మాట్లాడిన ఎమ్మెల్యే జీవీ గతంలో ఏ ప్రభుత్వాలు ఇంత పెద్ద మొత్తంలో సీఎం సహాయ నిధి ద్వారా ఆర్థిక సహాయం అందించలేదని, తెలుగుదేశం కూటమి ప్రభుత్వం మాత్రమే నిరుపేదలకు అండగా నిలిచి ఆదుకుంటుందని పేర్కొన్నారు. గడిచిన వైకాపా ప్రభుత్వంలో సీఎంఆర్ఎఫ్ కార్యక్రమాన్ని పూర్తిగా నిర్వీర్యం చేశారని, కొన్నిసార్లు ఇచ్చిన చెక్కులు కూడా చెల్లని దుస్థితి నెలకొన్న ఉదంతాలున్నాయన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి: డా.గుర్రం

విశాలాంధ్ర-మాచర్ల/వెల్దుర్తి : సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని శ్రీకృష్ణ హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ గుర్రం రాజశేఖర్ రెడ్డి తెలిపారు. మండలంలోని కళ్లకుంట గ్రామంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. సీజన్ వ్యాధుల నివారణలో పరిసరాల శుభ్రత, కాచివడపోసిన నీరు త్రాగాలని కోరారు. రైతులు, రైతు కూలీలు పొలాల్లో మందులు పిచికారి చేసేటప్పుడు ముక్కు నోటికి మాస్కు ధరించాలని, చేతులు శుభ్రంగా సబ్బుతో కడుక్కొని ఆహారాన్ని భుజించాలన్నారు. ముఖ్యంగా ధూమపానం, పొగాకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా 360 మంది రోగులకు ఉచితంగా ఉపిరితిత్తులు, గుండె, గ్యాస్, సమస్యలపై రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. ఈసీజీ, షుగర్, రక్త పరీక్షలు, నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు, పెద్ద సిబ్బంది పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో సంసిద్ విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర-శావల్యాపురం: తొమ్మిదవ ఇంటర్నేషనల్ కరాటే ఛాంపియన్ షిప్ పోటీలలో శావల్యాపురం మండలం కనమర్లపూడి సమీపంలోని సంసిద్ పాఠశాలకు చెందిన విద్యార్థులు అత్యున్నతమైన ప్రతిభను కనబరచి బంగారు, రజిత, కాంశ్య పతకాలను సాధించారని పాఠశాల హెచ్ఎం ఒంటేరు నాగసురేష్ తెలిపారు. హెచ్ఎం మాట్లాడుతూ మంగళగిరిలో జపాన్ షితో ర్యూ కరాటే స్కూల్ శుకొకై ఇజుషి వారు నిర్వహించిన ఈ పోటీలలో సంసిద్ విద్యార్థులు పాల్గొని 14 బంగారు, 8 రజతం, 8 కాంస్య పతకాలు సాధించారు. పతకాలు సాధించిన విద్యార్థును పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగ సురేష్, కరాటే మాస్టర్ ఖాజా మోహిద్దున్(బ్లాక్ బెల్ట్ సెకెండ్ డాన్) ఉపాధ్యాయులు అభినందించారు.

కోతులు, కుక్కలు, పందులు పట్టుకోవాలని ఏఐవైఎఫ్ వినతి

విశాలాంధ్ర - వినుకొండ : పట్టణంలో ప్రజలను ఇబ్బంది పెడుతున్న కోతులను, కుక్కలను, పందులను పట్టుకోవాలని సోమవారం మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో కమిషనర్ సుభాష్ చంద్రబోస్‌కు ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ అధ్యక్ష కార్యదర్శులు దండిపోయిన వెంకట అజయ్ కుమార్, తంగిరాల రమేష్ బాబు మాట్లాడుతూ వినుకొండ పట్టణంలో కోతులు, కుక్కలు, పందులతో ప్రజల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కొన్ని బజారులో డజన్ల కొద్దీ కుక్కలు తిరుగుతూ స్కూళ్లకు, ట్యూషన్లకు వెళుతున్న పిల్లలపై దాడులు చేస్తున్నాయి. దీనివల్ల పిల్లలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అలాగే పట్నంలోకి కోతులు ఎక్కువగా వచ్చి ఇళ్లల్లో జొరబడి ఇళ్లల్లో ఉన్న వస్తువులు పాడుచేస్తూ ప్రజల తోలుతుంటే వారిపై ఎగబడి దాడులు చేస్తున్నాయని, అలాగే స్లమ్ ఏరియాలో పందులు ఎక్కువగా తిరుగుతున్నాయని వీటిని పట్టుకోపోతే అంటు వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని, కాబట్టి వెంటనే కమిషనర్ స్పందించి వీటిని పట్టుకొని అడవుల్లో వదిలిపెట్టించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాజు, సుభాని, మల్లికార్జున, లాజర్, మస్తాన్, వెంకటేష్, భాస్కర్, బాషా తదితరులు పాల్గొన్నారు.

అలరించిన భక్తి గేయ కచేరి

విశాలాంధ్ర- తెనాలి : బాపట్ల జిల్లా వేమూరు మండల గ్రామం చదలవాడలో శ్రీ సాయిరామ జానకి భక్త సమాజం ఆధ్వర్యంలో కార్తీకమాసం సందర్భంగా భక్తి గేయాలాపన, తాళాల భజన కార్యక్రమం నాలుగు గంటల పాటు భక్తులను, ప్రేక్షకులను ఆకట్టుకుంది. కార్తీకమాస శుక్ల దశమి ఆదివారం రాత్రి నుండి సోమవారం ఉదయం వరకు శివాలయ ప్రాంగణంలో ఈ కార్యక్రమాన్ని జరుపుకున్నారు. నూతనంగా నేర్చుకున్న 30 మహిళా బృంద పాట కచేరిని దేవాలయ కార్యనిర్వాహనాధికారి శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. శివుని, గణేషుని, పార్వతీ అమ్మవారిని, ఇతర దేవుళ్ళను స్తుతిస్తూ ఆలపించిన పాటలు భక్తులను పరవశింపజేశాయి. ఎన్.సి.సి. అధికారి బెల్లంకొండ వెంకట్ గురువులు సారథ్యం వహించగా బొల్లిముంత కృష్ణ కోటేశ్వరరావులు పర్యవేక్షించారు. కన్నుల పండుగగా జరిగిన ఈ కార్యక్రమాన్ని పరిసర గ్రామాలనుండి కూడా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. గాయనీమణులు చందు త్రివేణి, అపర్ణ, ఝాన్సీ, లీలాకుమారి, నగరాజ, దినేష్, ధనమ్మ, అరుణ, అనిత, సునీత, శిరీష, విజయ, మంజు, సౌదామిని, సరళ, చిరంజీవులు హరిత, శుస్రుత తదితరులు మృదుమధురంగా గానం చేశారు. ఈ సందర్భంగా గురువులు బెల్లంకొండ వెంకట్, బొల్లిముంత కృష్ణ, ఆర్కెస్ట్రా బృందం పెద్దిరాజు, నాగప్రసాద్, నీలాంబ్రంలను శాలువాలతో ఘనంగా సత్కరించారు.

భూ సమీకరణకు మొగ్గు

విశాలాంధ్ర- తాడికొండ : అమరావతి రాజధానికి తాడికొండ మీదగా రైల్వే లైన్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో పనులు మొదలుపెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధపడింది. నంబూరు నుంచి కొప్పురావూరు కంతేరు, తాడికొండ, పెద్దపరిమి, అనంతవరం మీదుగా వడ్డమానుకు రైల్వే లైను వేయనున్నారు. అదేవిధంగా పెదకూరపాడు నుంచి రావెల గ్రామం మీదగా రాజధానికి మరో రైల్వే రానుంది, కొన్ని సర్వే నంబర్లు సైతం ప్రభుత్వం ప్రకటించింది. అయితే ప్రభుత్వం భూ సమీకరణకు వెళుతుందా లేక భూసేకరణకు వెళుతుందా అని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ మేరకు ఈ నెల 10న తాడికొండ పంచాయతీ కార్యాలయాలను రైతులు సమావేశమయ్యారు. భూ సేకరణ వద్దు... భూ సమీకరణ ముద్దు అంటూ ముందుకొస్తున్నారు. రాజధానిలో భూ సమీకరణ మాదిరిగానే తమను ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

అసెంబ్లీని బహిష్కరించిన వైసీపీ ఎమ్మెల్యేలు తక్షణమే రాజీనామా చేయాలి: డొక్కా

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ప్రజాస్వామ్య దేవాలయమైన అసెంబ్లీని..అసెంబ్లీ సమావేశాలను బహిష్కరించిన వైసీపీ ఎమ్మెల్యేలు తక్షణమే రాజీనామా చేయాలని మాజీమంత్రి డొక్కా మాణిక్యవర ప్రసాద్ డిమాండ్ చేశారు. సోమవారం అరండల్‌పేటలో ఉన్న కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాలను వైసీపీ బహిష్కరించడం రాజ్యాంగ వ్యతిరేక చర్య అని ధ్వజమెత్తారు. రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను అవమానించిన వైసీపీ నాయకులు సిగ్గుపడాలని, వైసీపీ ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని స్పీకర్‌కు లేఖ రాసి పంపుతున్నట్లు పేర్కొన్నారు. వైసీపీ కార్యకర్తలు సామాజిక మాధ్యమాల్లో పవన్ కల్యాణ్ కుమార్తెలు, భార్య మీద విషం చిమ్ముతున్నారని, ఇది మంచి సాంప్రదాయం కాదని హితవుపలికారు. తాము అధికారంలోకి వస్తే అది చేస్తాం..ఇది చేస్తాం అంటూ విధి నిర్వహణలో ఉన్న ఐఏఎస్, ఐపిఎస్ అధికారులను జగన్‌మోహన్‌రెడ్డి బెదిరిస్తున్నాడని, ఆయనకు ప్రజాస్వామ్యమంటే గౌరవం లేదన్నారు. ప్రవచన కారుడు, ఆధ్యాత్మికవేత్త చాగంటి కోటేశ్వరరావుతో నైతిక విలువల పాఠాలు బోధింపచేయాలని సూచించారు. ఈ సమావేశంలో జనసేన నాయకులు పాలకాయల వెంకట్, టీడీపీ నాయకులు షేక్ జిలాని, బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర నాయకులు దర్శనపు శ్రీనివాస్, బీజేపీ నాయకులు మందలపు సురేష్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర బడ్జెట్‌పై మిశ్రమ స్పందన

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల సందర్భంగా రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టిన రూ.2.94 లక్షల కోట్ల బడ్జెట్‌పై పలు పార్టీలకు చెందిన నేతలు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు ఎప్పటి నుంచి అమలు చేస్తారో స్పష్టతలేదని అన్నారు. సూపర్-6 అమలుకు గ్యారెంటీ ఈ బడ్జెట్‌లో కనిపించలేదన్నారు. ప్రజల సంక్షేమాన్ని విస్మరించినట్లు ఉందని అన్నారు. బీసీ సంక్షేమానికి రూ.3,907 వేల కోట్లు కేటాయించడంపై బీసీ వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయని పలువురు అన్నారు.

ఇది ప్రజా వ్యతిరేక బడ్జెట్..

జంగాల అజయ్‌కుమార్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు

సూపర్-6 అమలుకు గ్యారెంటీ ఇచ్చే పద్ధతిలో బడ్జెట్ లేదు. ప్రతి మహిళకు నెలకు రూ.1500లు, రైతుకు ముందస్తు పెట్టుబడి సాయం రూ.20 వేలు ఊసే లేదు. యువతకు ఉపాధి కల్పించడానికి అవసరమైన కేటాయింపులు లేవు. భవన నిర్మాణ రంగానికి కేటాయింపులు లేవు. సంక్షేమ బోర్డు ఊసే లేదు. ఆటో రంగానికి ఇస్తామన్న గ్యారెంటీలు కనబడలేదు. ద్రవ్యలోటు, రెవెన్యూ లోటు వ్యత్యాసాన్ని ఏ విధంగా పూడుస్తారన్న ప్రస్తావన బడ్జెట్‌లో లేకపోవడం గమనించాలి. విద్యుత్ భారాలు నివారించడానికి కావాల్సిన కేటాయింపులు బడ్జెట్‌లో నామమాత్రంగా కూడా లేవు. ఉన్నత విద్యా రంగానికి తగిన ప్రాధాన్యత బడ్జెట్‌లో కనబడలేదు. కౌలు రైతుల సమస్యల పరిష్కారానికి బడ్జెట్‌లో కేటాయింపులు లేవు. రైతు వ్యతిరేక బడ్జెట్‌గా కనబడుతోంది. ప్రజలకు అవసరమైన రంగాలకు కేటాయింపుల విషయంలో బడ్జెట్ శ్రద్ధ వహించలేదు. మొత్తంగా రైతులు, కార్మికులకు ఉపయోగం లేని అవగాహన రాహిత్య బడ్జెట్‌గా ఉంది.

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా బడ్జెట్

గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళ మాధవి

రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్ర బడ్జెట్ ఉంది. బడ్జెట్‌లో విద్యా, వైద్యం, వ్యవసాయ రంగాలకు పెద్దపీట వేశారు. తల్లికి వందనం, ఉచిత బస్సు ప్రయాణం, గుంటూరు వంటి ప్రధాన నగరాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించటం హర్షనీయమని, బీసీ సంక్షేమానికి రూ.3,907 కోట్లు కేటాయించటంపై బీసీలలో ఆనందోత్సాహాలు వ్యక్తవుతున్నాయి.

వాగ్దానాల వివరణ తప్ప అమలు లేని బడ్జెట్..

సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు

రాష్ట్ర ఆర్థిక మంత్రి బడ్జెట్ ప్రసంగాన్ని పరిశీలిస్తే ఆత్మ స్తుతి 'పరనిందలా ఉంది'. ప్రస్తుత ముఖ్యమంత్రిని కీర్తించడం, గత ప్రభుత్వాన్ని విమర్శించడమే తప్ప కూటమి ప్రభుత్వం ప్రజలకిచ్చిన వాగ్దానాలు ఎప్పటి నుంచి అమలు చేస్తారో బడ్జెట్‌లో స్పష్టత లేదు. దళితులు, గిరిజనులు, మైనార్టీలు, మహిళల సంక్షేమానికి బడ్జెట్‌లో నామమాత్రపు కేటాయింపులు చేశారు. గుంటూరు ఛానల్ పొడిగింపు, నల్లమడ ఆధునీకరణ, పెదవడ్లపూడి హైలెవెల్ ఛానల్ పొడిగింపు తదితర ప్రాజెక్టులకు నిధుల కేటాయింపు అంశంలో స్పష్టత లేదన్నారు. అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలు అమలుపై బడ్జెట్‌లో స్పష్టత లేదు. ప్రజల సంక్షేమాన్ని, రాష్ట్ర అభివృద్ధిని విస్మరించినట్లుగా ఉంది.

అన్ని వర్గాల ప్రజలకు ఆమోదయోగ్యంగా బడ్జెట్..

టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి దామచర్ల శ్రీనివాసరావు

అన్ని వర్గాల ప్రజలకు ఆమోదయోగ్యంగా బడ్జెట్ ఉంది. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నా కూడా దేశంలోనే అత్యున్నతమైన బడ్జెట్‌ని కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టింది. సూపర్ సిక్స్ పథకాల అమలుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుంది. నీటిపారుదల శాఖకు గత ప్రభుత్వం కంటే రెండు రెట్ల అదనపు నిధులు కేటాయించింది. అభివృద్ధి, సంక్షేమానికి ప్రతిబింబంగా ఉన్న బడ్జెట్ ఇది.

వెండింగ్ జోన్లు ఫైనల్ చేసేందుకు సహకరించాలి: కమిషనర్

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : నగరపాలక సంస్థ పరిధిలో నూతన వెండింగ్ కమిటీ ఏర్పాటు చేసుకొని, డిశంబర్ 10వ తేదీలోపు వెండింగ్ జోన్లను ఫైనల్ చేసుకోవడానికి వీధి వ్యాపారులు, ఆయా సంఘాల ప్రతినిధులు సహకరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. సోమవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో వీధి వ్యాపారుల సమస్యలు, వెండింగ్ కమిటి ఏర్పాటు, వెండింగ్ జోన్ల నిర్ధారణ తదితర అంశాలపై వెండింగ్ కమిటి సభ్యులు, ట్రాఫిక్, ఆర్ అండ్ బీ, ట్రాన్స్‌పోర్ట్, మెప్మా, సీపీడీసీఎల్, జీఎంసీ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. తొలుత వెండర్స్ కమిటి సభ్యులను ప్రస్తుతం వారు ఎదుర్కొంటున్న సమస్యలు, జోన్ల ఏర్పాటు, గుర్తింపు కార్డ్‌ల పంపిణీపై వివరాలు కమిషనర్ అడిగి తెలుసుకున్నారు. వీధి వ్యాపారుల సమస్యల పరిష్కారానికి, వారికి మెరుగైన సంక్షేమ చర్యలు తీసుకోవడానికి ముందుంటామన్నారు. వీధి వ్యాపారుల

దగ్గర అద్దెలు పేరుతో దోచుకుంటున్న దళారులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రస్తుతం అత్యవసరంగా వెండింగ్ జోన్లను నిర్ధారణ చేసుకోవాల్సిన అవసరం ఉందని, అందుకు తొలుత నూతన వెండింగ్ కమిటిని ఏర్పాటు చేసుకోవాలన్నారు. కమిటీలో చట్ట ప్రకారం కేవలం వీధి వ్యాపారులు, ఆయా డిపార్ట్మెంట్ అధికారులు, ప్రజాప్రతినిధులు మాత్రమే సభ్యులుగా ఉంటారన్నారు. కమిటి ఏర్పాటు అనంతరం డిశంబర్ 10 నాటికి జోన్లను ఫైనల్ చేసుకునే లక్ష్యంతో స్థలాల పరిశీలన చేయాలన్నారు. ఆయా స్థలాలు వీధి వ్యాపారులు నిర్భయంగా, స్వేచ్ఛగా ఏవిధమైన దోపిడీకి గురికాకుండా వ్యాపారం చేసుకునేలా ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. జోన్ల ఏర్పాటు వలన ఆయా వ్యాపారస్తులకు గుర్తింపు కార్డ్‌లు, పీఎం స్వానిధి బ్యాంక్ రుణాలు వంటి అనేక సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. జోన్ల మీద ఎటువంటి అపోహలు పెట్టుకోవద్దని, అవసరమైతే వెండింగ్ కమిటీ సభ్యులను జీఎంసీ ఖర్చులతో వెండింగ్ జోన్లు అమలు చేస్తున్న నగరాల పరిశీలనకు పంపుతామన్నారు. అలాగే ఈ నెల 14 నుంచి జీఎంసీ ప్రధాన కార్యాలయంలో వీధి వ్యాపారుల గుర్తింపు దరఖాస్తులను ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసి అందిస్తామని, వీధి వ్యాపారులు దరఖాస్తు పూర్తి చేసి, అదే కౌంటర్‌లో అందిస్తే వాటిని క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసి, గుర్తింపు కార్డ్‌లు అందిస్తామని తెలిపారు. సమావేశంలో అదనపు కమిషనర్ సిహెచ్ ఓబులేసు, డిప్యూటీ కమిషనర్ డి.శ్రీనివాసరావు, సిటి ప్లానర్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ధనుర్మాస వ్రత మహోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర-మంగళగిరి : సకల సంపదలను ప్రసాదించే గోదావరి ఆచరించిన శ్రీకృష్ణ దీక్షా సహిత ధనుర్మాస వ్రత మహోత్సవాలు డిసెంబర్ 16వ తేదీ నుంచి జనవరి 13వ తేదీ వరకు మంగళగిరి మండలం ఆత్మకూరు బాపూజీ విద్యాలయం ఆవరణలో శ్రీ చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామివారి ప్రత్యక్ష పర్యవేక్షణలో నిర్వహించనున్నట్లు సీతానగరం చిన జీయర్ ఆశ్రమం ఆధ్యాత్మిక వ్యాఖ్యాత కూర్మనాథ ఆచార్యులు తెలిపారు. మంగళగిరి బైపాస్ రోడ్‌లోని వైటీఆర్ ట్రస్ట్ కార్యాలయంలో సోమవారం ధనుర్మాస వ్రత మహోత్సవాల వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బాపూజీ విద్యాలయం చైర్మన్ వై.తులసి రామ్, వేద విశ్వవిద్యాలయం ప్రిన్సిపల్ మధుసూదనాచార్యులు, విజయ కీలాద్రి ప్రధాన అర్చకులు శ్రీనివాసాచార్యులు, ఆశ్రమ నిర్వాహకులు రఘునాథచార్యులు, న్యాయవాది నాగార్జున బాబు, తుల్లిమిల్లి రామకృష్ణ, కొలుసు రాజా, త్రిపురమల్లు సతీష్, బలరామ్ సేన, వికాస్ తరంగిణి నాయకులు రుక్మిణి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉషు ఫైట్‌లో కాంస్యం గెలుచుకున్న పవన్ భాస్కర్

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : 63వ రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) అండర్-17, 19 కేటగిరి ఉషు ఛాంపియన్‌షిప్-2024 ఈ నెల 3, 4 తేదీల్లో శ్రీకాకుళం జిల్లాలో జరిగాయి. ఈ పోటీల్లో గుంటూరు పట్టాభిపురం పీఎంసీ హైస్కూల్లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థి పి.పవన్ భాస్కర్ ఉషు సండా ఫైట్ 60 కేజీ లోపు విభాగంలో కాంస్య పతకం గెలుచుకున్నాడు. ఈ సందర్భంగా పీఎంసీ స్కూల్ హెచ్‌ఎం వై.వీరబాబు, ఉషు సెక్రటరీ నరసింహారావు, స్కూల్ పీఈటీ పి.శ్రీనివాసరావు, ఉషు కోచ్ ఎం.కిరణ్ కుమార్, తల్లిదండ్రులు పవన్ భాస్కర్‌ను అభినందించారు.

సివిల్ సప్లయిస్ కార్మికుల సమస్యలు పరిష్కరించండి

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : జిల్లాలోని సివిల్ సప్లయిస్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం గుంటూరు కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఆంధ్రప్రదేశ్ స్టేట్ సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ హమాలీ(ముఠా) వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి రావుల అంజిబాబు, జిల్లా కమిటీ సభ్యులు వినుకొండ జాన్ బాబు, శ్రీను, కిరణ్, కె.పోలయ్య తదితరులతో జిల్లా జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజకు సమస్యల వినతిపత్రం అందజేశారు. రావుల అంజిబాబు మాట్లాడుతూ ఎండనకా వాననకా రాత్రింబవళ్లు కష్టపడి పనిచేస్తున్న ముఠా కార్మికుల నెల బిల్లు మళ్లీ నెల వచ్చేదాకా రాకపోవటంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా పంపిణీ వ్యవస్థలో కీలక భాగస్వామిగా ఉన్న ముఠా కార్మికుల కూలి రేట్ల నెల బిల్లును పదో తేదీలోపు కార్మికులకు అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

మైనార్టీ ప్రముఖులకు సన్మానం

విశాలాంధ్ర- పెదనందిపాడు: మండల పరిధిలోని నాగులపాడు లయన్స్ మాంటిస్సోరి ఉన్నత పాఠశాల (సీబీఎస్ఈ) నందు సోమవారం భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ 137 వ జయంతి సందర్భంగా మైనార్టీ సంక్షేమ దినోత్సవం, జాతీయ విద్యా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మైనార్టీ ప్రముఖులను పాఠశాల యాజమాన్యం వారు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల గౌరవాధ్యక్షులు దాసరి శేషగిరిరావు, కరస్పాండెంట్ అండ్ సెక్రటరీ ముద్దన నగరాజకుమారి, వైస్ ప్రెసిడెంట్ ముద్దన రాఘవయ్య, సభ్యులు నర్రా బాలకృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిశ్రమల స్థాపనకు బీసీలకు అవకాశాలు కల్పించాలి : కేసన

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: 2015-20 ప్రభుత్వ పారిశ్రామిక విధానంలో ఎనెక్షర్-1 లో పరిశ్రమల స్థాపనకు ఎస్సీ, ఎస్టీలకు అనర్హత నిబంధన లేకుండా, అన్ని రకాల పరిశ్రమల స్థాపనకు అవకాశాలు కల్పిస్తున్నట్లే, బీసీ పారిశ్రామికవేత్తలకు కూడా అవకాశం కల్పించాలని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, బీసీ సంక్షేమ శాఖ మంత్రిని సోమవారం సచివాలయంలోని వారి చాంబర్లలో కలిసి, ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు నేతృత్వంలోని బీసీ నాయక బృందం విజ్ఞాపన పత్రాలను సమర్పించారు. ఇంకా వారు వెనుకబడిన తరగతుల ఆర్థిక సంస్థ, వెనుకబడిన తరగతుల సంక్షేమ సంఘముల

ఉమ్మడి యాజమాన్యంలో పిపిపి మోడ్‌లో ఒక నాన్ బ్యాంకింగ్ సంస్థ స్థాపనకు ఏర్పాటు చేయాలని కోరామన్నారు. ఎస్సీ ఎస్టీలకు ఇన్సెంటివ్ వర్తించు అన్ని పరిశ్రమలు వలెనే బీసీలకు కూడా ఇన్సెంటివులు వర్తించేలా ఆపరేషన్ గైడెన్స్‌లో పొందుపరచాలన్నారు. ప్రస్తుత కో-ఆపరేటివ్ చట్టాల ప్రకారం సహకార సంఘం ఏర్పాటుకు పదిమంది సభ్యులు కావాల్సి ఉన్నదని, దానిని మార్చి కంపెనీస్ చట్టం వలె ఒకరు లేదా ఇద్దరితో బీసీలు సహకార సంఘం ఏర్పాటు చేసుకొనుటకు అవకాశం కల్పించాలని, అందువల్ల ఫార్మర్స్ ప్రొడ్యూసింగ్ ఆర్గనైజేషన్(ఎఫ్‌పిఒ) లు కోపరేటివ్ యాక్ట్ ప్రకారం రిజిస్టర్ చేసుకోవడం వల్ల రైతుల ఉత్పత్తుల సంస్థ (ఎఫ్‌పిఒ) లు బాగా అభివృద్ధి చెందడానికి అవకాశాలుంటాయన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు సింగిల్ విండో ద్వారా ల్యాండ్ కన్వర్షన్ జరుగుటలేదని, మధ్యలో ఉన్న మీసేవ పేమెంట్ కనెక్షన్ సమస్యను పరిష్కరించాలని వారు కోరారు.

ఎంపీడీఓను కలిసిన రైతు సంఘ నాయకులు

విశాలాంధ్ర-తాడి కొండ : స్థానిక ఎంపీడీఓ కె.సమత వాణిని రైతు సంఘం నాయకులు సోమవారం తహ శీల్దార్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. రైతు సమస్యలు, ఉపాధి హామీ, గ్రామాల అభివృద్ధిపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి పచ్చల శివాజీ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కాబోతు ఈశ్వరరావు, సీపీఐ తాడికొండ నియోజకవర్గ కార్యదర్శి ముప్పాళ్ళ శివ శంకర్ రావు, నాయకులు గుర్రం సత్యానందం, చింతల భాస్కరరావు, కె.పూర్ణ, ఖమ్మంపాడు దేవుని దయ, రేపూడి శ్రీనివాసరావు, తోకల అనురాధ పాల్గొన్నారు.

ప్రభుత్వం ఉచిత ఇసుక అందజేయాలి: మారుతి

విశాలాంధ్ర - వినుకొండ : పేదలు తమ స్వంత గృహాల నిర్మాణాలకు ఇసుకను ఎక్కువ డబ్బు పెట్టి కొనవలసి వస్తుందని, ప్రభుత్వం చెప్పినట్లుగా ఉచిత ఇసుక దొరకడం లేదని, ప్రభుత్వమే క్వారీలను నిర్వహించి ఉచిత ఇసుకను సరఫరా చేయాలని పల్నాడు జిల్లా సీపీఐ కార్యదర్శి మారుతీ వరప్రసాద్ డిమాండ్ చేశారు. వినుకొండ పట్టణ గృహ నిర్మాణదారులు, భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వ ర్యంలో సోమవారం నిర్మాణ కార్మికులు పనులకు వెళ్లే మెట్ట ప్రాంతంలో నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడుతూ పేద ప్రజలు ఇసుకను ఎక్కువ రేటు పెట్టి కొనవలసి వస్తున్నందున గృహాల నిర్మాణాలు తగ్గిపోయాయని దానివల్ల భవన నిర్మాణ కార్మికులకు పనులు లేకుండా పోతున్నాయని విమర్శించారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఇసుక విషయంలో ప్రజలు అనేక ఇబ్బందులు పాలయ్యారని, వారి ప్రభుత్వం ఏర్పడ్డాక ఆరు మాసాలు ఇసుకపై బ్యాన్ విధించారని, దీంతో రాష్ట్రంలో 30 లక్షల మంది భవన నిర్మాణ కార్మికులు కూలి పనులు దొరక్క కుటుంబాలు గడవక అల్లాడిపోయారని, భవన నిర్మాణ కార్మికులు అనేక ఉద్యమాలు చేసిన నేపథ్యంలో అరకొరగా ఇసుకను కొనుగోలు చేసే విధంగా గత ప్రభుత్వ చేసిన నిర్ణయాల వల్ల కార్మికులు, నిర్మాణదారులు ఇసుకను ఎక్కువ రేట్లు పెట్టి కొనలేక గృహాలు నిర్మించకోలేక ఇబ్బందుల పాలయ్యారని, కార్మికులు కూలీ దొరకక అల్లాడిపోయారని తెలిపారు. నేటి ముఖ్యమంత్రి చంద్రబాబు ఆనాడు మాట్లాడుతూ మా ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఉచిత ఇసుకను సరఫరా చేస్తామని చెప్పారని, ఇటీవల ఉచిత ఇసుక అమలు చేయాలని కింది స్థాయి అధికారులను ఆదేశించినా ఇంతవరకు ప్రజలకు ఉచిత ఇసుక అందడం లేదని, దాని ఫలితంగా నిర్మాణదారులకు ఇసుక కొనటం చాలా కష్టతరమైందని, కావున ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకొని ప్రభుత్వమే క్వారీలను నిర్వహించి ప్రజలకు ఉచిత ఇసుకను సరఫరా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సీపీఐ నాయకులు బూదాల శ్రీనివాసరావు, పట్టణ కార్యదర్శి ఉలవలపూడి రాము, ఏఐటీయూసీ నాయకులు కొండముట్ల షేక్ చిన్న, సుభాని, మాజీ కార్యదర్శి శ్రీను, వెంకటేశ్వర్లు, కరిముల్లా, షేక్ సైదా, మల్లికార్జున రావు, రమణమ్మ, పద్మావతి, కార్మికులు పాల్గొన్నారు.

విద్యా వ్యవస్థకు పునాదులు వేసిన మహనీయుడు అబుల్ కలాం ఆజాద్

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: భారతదేశ విద్యా వ్యవస్థకు పునాదులు వేసిన మహనీయుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ అని జైన్ హై స్కూల్ డైరెక్టర్ డాక్టర్ మొహమ్మద్ మున్ను అన్నారు. సోమవారం మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మున్ను మాట్లాడుతూ భారతదేశంలో సాంకేతిక విద్యను గ్రామ గ్రామాన వ్యాపింపచేసే విధంగా కృషిచేసిన ఘనత అబుల్ కలాం ఆజాద్‌కు చెందుతుందని అన్నారు. బ్రిటీష్ సామ్రాజ్యానికి వ్యతిరేకంగా స్వాతంత్ర సంగ్రామంలో పోరాటం చేసి తన కలం ద్వారా జనాన్ని జాగృతం చేశారని తెలిపారు. యుజిసి ఐఐఎంల స్థాపనలో ఆయన కీలక పాత్ర పోషించారని అన్నారు. భారతదేశంలో మతసామరస్యాన్ని చాటి చెప్పారన్నారు. అలాంటి మహనీయులను స్మరించుకొని విద్యార్థులు ఆదర్శంగా నిలవాలని మున్ను పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జైన్ హై స్కూల్ ప్రిన్సిపాల్ పి కనకదుర్గ, ఉపాధ్యాయులు అనూష, అఖిల, సరోజినీ, రహిమ, షబీనా, గాయత్రి, విద్యార్థిని విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఇసుకపై పన్నులు ఎత్తివేయాలి

విశాలాంధ్ర-చిలకలూరిపేట: ఇసుకపై అన్ని రకాల పన్నులు ఎత్తివేయాలని, ప్రభుత్వమే ఇసుక ర్యాంపులు నడపాలని ఏఐటీయూసీ గౌరవ అధ్యక్షురాలు, సీపీఐ ఇన్‌చార్జి కార్యదర్శి నాగబైరు రామ సుబ్బాయమ్మ కోరారు. రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా నరసరావుపేట జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట సోమవారం నిర్వహించనున్న ఏఐటీయూసీ అనుబంధ భవననిర్మాణ కార్మిక సంఘం నాయకులు తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సుబ్బాయమ్మ మాట్లాడుతూ రాష్ట్రంలో భవన నిర్మాణ కార్మికుల పరిస్థితి దారుణంగా ఉందని, ఇసుక తవ్వకం ప్రైవేటు ఏజెన్సీలకు ఇవ్వడం నిలిపివేయాల న్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు ఆరాధ్యుల రామకృష్ణ, బొంతా భగత్‌సింగ్, భవననిర్మాణ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు తూబాటి సుభానిమేస్త్రి, నాయకులు గోపి, శ్రీను, సింగ్, సుభాని, శివకృష్ణ, జాను, రాడ్‌బెడింగ్ గోపి తదితరులు ఉన్నారు.

సాగు సహాయం అందజేయాలి

విశాలాంధ్ర-ప్రత్తిపాడు: ప్రభుత్వం వాగ్దానం మేరకు తక్షణమే రైతులకు, కౌలు రైతులకు సాగు సహాయం రూ.20వేలు వెంటనే అందజేయాలని జిల్లా కౌలు రైతు సంఘ అధ్యక్షులు జగన్నాథం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తాసిల్దార్ కు సోమవారం వినతి పత్రం అందజేశారు. అకాల వర్షాల వల్ల పంటలు బాగా దెబ్బతిన్నాయని , రైతుల రుణమాఫీ చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సిపిఐ కార్యదర్శి రామిశెట్టి ఆదేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో కార్తీక వన సమారాధన

విశాలాంధ్ర-తెనాలి : తెనాలికి చెందిన ఆంధ్ర ప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (ఏపీయూడబ్ల్యూజే) సంఘం ఆధ్వర్యంలో సోమవారం అంగలకుదురు గ్రామ శివార్లలోని నిమ్మతోటల్లో సందడి సందడిగా జరిపారు. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే జిల్లా నాయకులు, పాత్రికేయులు పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో జిల్లా అధ్యక్షుడు షేక్ నాగుల్ మీరా, రాష్ట్ర నాయకుల భక్తవత్సలం, రాష్ట్ర ఎలక్ట్రానిక్ మీడియా రాష్ట్ర సంఘ అధ్యక్షుడు ఏచూరి శివ మాట్లాడుతూ పాత్రికేయుల సమస్యల పరిష్కారానికి సంఘం కృషి చేస్తుందన్నారు. సంఘ సభ్యులంతా ఐకమత్యంగా ఉండి సమస్యల పరిష్కారా నికి కృషి చేస్తున్న సంఘానికి సహకరించాలన్నారు. తెనాలి శాఖ సంఘ అధ్యక్షుడు చందు సుబ్బారావు, కార్యదర్శి ఎం. గోపీచంద్ పర్యవేక్షించిన ఈ కార్యక్ర మంలో ఐజెయు సభ్యులు గిరిధర్, మార్కండేయులు, జిల్లా నాయకులు చొప్పర సుధాకర్, కె. రమేష్, బి.మురళీ, కమిటీ సభ్యులు, తారక్ సాయినాథ్, బొల్లి ముంత కృష్ణ, ఎల్.వెంకటేశ్వరరావు, ఎస్. సాయినాథ్, శరత్‌బాబు, షేక్ అబ్దుల్ హాకీం జాని, కమలాకర్, కిరణ, కళ్యాణ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణ్‌కు చేనేత కార్మిక సంఘం నివాళి

విశాలాంధ్ర-మంగళగిరి : పట్టణంలోని నాలుగో వార్డ్‌కు చెందిన సీపీఐ సీనియర్ నాయకులు కళ్యాణ్ సోమవారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన భౌతికకాయానికి ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి నాగేశ్వరరావు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందజేసి, ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. నివాళులర్పించిన వారిలో చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు గజవల్లి వెంకటకృష్ణ, బత్తుల గిరి, దొడ్డి ఈశ్వ రరావు, సంఘం నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ఫిర్యాదులను పరిష్కరించాలి : ఎస్పీ

విశాలాంధ్ర-నరసరావుపేట: జిల్లాలో పోలీసు అధికారులు ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ప్రజల నుండి వచ్చే సమస్యలకు మొదటి ప్రాధాన్యత కల్పించి వెంటనే పరిష్కరించాలని ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆదేశించారు. కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఎస్పీ బాధితుల నుంచి స్వయంగా ఫిర్యాదులు స్వీకరించి వారి సమస్యలన్నీ వివరంగా తెలుసుకున్నారు. ఈ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుండి కుటుంబ, ఆర్థిక, ఆస్తి తగాదాలకు సంబంధించి 51 ఫిర్యాదులు ఎస్పీ కి అందాయి. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ప్రజలకు వారి ఫిర్యాదులను రాసి పెట్టడంలో పోలీస్ సిబ్బంది సహాయ సహకారాలు అందించారు మరియు భోజన ఏర్పాట్లను చేసినారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన

విశాలాంధ్ర-పొన్నూరు : పొన్నూరు మండలం ములుకుదురు గ్రామంలోని 12వ పోలింగ్ కేంద్రాన్ని మండల తహశీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్ ఆదివారం స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా పరిశీలించారు. 18 సంవత్సరాల వారు ఓటు నమోదు చేసుకోవాలని సూచించారు. ఓటు తొలగింపు ఫారం-7, సవరణ, బదలాయింపుకు ఫారం- 8 దాఖలు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ముసాయిదా ఓటర్ల జాబితాలో అభ్యంతరాలు ఉంటే స్థానిక బిఎల్‌ఓలను సంప్రదించి సమస్యను పరిష్కరించుకోవచ్చని సూచించారు.

విద్యతోనే అత్యున్నత శిఖరాలు అధిరోహించవచ్చు: షమ సుల్తానా

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : విద్యతోనే అత్యున్నత శిఖరాలను అధిరోహించవచ్చని హోప్‌విన్ హాస్పిటల్స్ చైర్మన్, మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి (ఎంహెచ్‌పీఎస్)రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు డాక్టర్ షమ సుల్తానా అన్నారు. గుంటూరు పొన్నూరు రోడ్డు సంగడిగుంట నందు ఉన్న ఆంధ్రప్రదేశ్ గురుకుల పాఠశాల (మైనారిటీ బాలికలు)లో 'నేషనల్ ఎడ్యుకేషన్ డే' వేడుకలు షమ సుల్తానా ఆధ్వర్యంలో సోమవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికలకు విద్య యొక్క ప్రాధాన్యతను.. విద్య వల్ల సమాజంలో కలిగే గౌరవ ప్రతిష్టలను బాలికలకు ఆమె విశదీకరించారు. అనంతరం డాక్టర్ షమ సుల్తానా మాట్లాడుతూ విద్యార్థినీ, విద్యార్థుల భవిష్యత్తు విద్యపైనే ఆధారపడి ఉంటుందన్నారు. మీ భవిష్యత్తుతో పాటు తల్లిదండ్రుల భవిష్యత్తు కూడా మారుతుందన్న విషయాన్ని గుర్తెరిగి మంచిగా చదువుకోవాలని సూచించారు. నేను పలాన ఉద్యోగం సంపాదించాలన్న లక్ష్యంతో ముందడుగు వేయాలని విద్యార్థినీలకు తెలియజేశారు. తామ పడుతున్న ఇబ్బందులను మా బిడ్డలు పడకూడదన్న తల్లిదండ్రుల కోరిక మేరకు జీవితంలో అత్యున్నత శిఖరాలకు చేరే విధంగా చదువుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంగడిగుంట ఆంధ్రప్రదేశ్ గురుకుల పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు, ఎంహెచ్‌పీఎస్ సభ్యులు పాల్గొన్నారు.

స్కేటింగ్ పోటీల్లో మంగళగిరి క్రీడాకారుల సత్తా

విశాలాంధ్ర-మంగళగిరి : రాష్ట్రస్థాయి 36వ స్కేటింగ్ పోటీల్లో మంగళగిరి క్రీడాకారులు మాత్రపు జెస్సిరాజ్, మాత్రపు జోయల్ ఆదర్శ్ సత్తాచాటారు. ఈ నెల 6 నుంచి 11వ తేదీ వరకు స్థానిక మంగళగిరిలోని మున్సిపల్ స్కేటింగ్ పార్క్‌లో జరిగిన ఈ పోటీలకు రాష్ట్రవ్యాప్తంగా 250 మంది క్రీడాకారులు ప్రాతినిధ్యం వహించారు. ఈ పోటీల్లో జెస్సిరాజ్ మూడు(ఇన్ లైన్ విభాగంలో సిల్వర్, సోలో డాన్స్ విభాగంలో సిల్వర్, ఫిగర్ విభాగంలో బ్రాంచ్) పతకాలను సొంతం చేసుకుంది. అదేవిధంగా జోయల్ ఆదర్శ్ రెండు(ఇన్ లైన్ విభాగంలో బ్రాంచ్, ఫిగర్ విభాగంలో బ్రాంచ్) పతకాలను సాధించాడు. వీరిద్దరూ మంగళగిరిలోని విక్టరీ స్కేటింగ్ అసోసియేషన్ అకాడమీలో గత కొన్నేళ్లుగా శిక్షణ పొందుతున్నారు. పతకాలు సాధించిన క్రీడాకారులను ఏపీ స్కేటింగ్ సంఘం కార్యదర్శి థామస్ చౌదరి, చైర్మన్ పవన్ కుమార్, సీనియర్ కోచ్ సింహాద్రి అభినందించారు. కాగా జెస్సిరాజ్ ఇటీవల న్యూజిలాండ్‌లో జరిగిన ప్రపంచ స్థాయి ఆర్టిస్ట్ స్కేటింగ్ పోటీల్లో ప్రథమ స్థానం సాధించి బంగారు పతకం కైవసం చేసుకున్న విషయం తెలిసిందే. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

ఏపీ లో 10 గిగా వాట్ ప్రాజెక్ట్ స్వచ్ఛ ఇంధన విప్లవానికి కట్టుబడిన సెరెంటికా రెన్యూవబుల్స్

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): భారతదేశంలోని ప్రముఖ పునరుత్పాదక ఇంధన సంస్థ, సెరెంటికా రెన్యూవబుల్స్, ("సెరెంటికా" లేదా "కంపెనీ") ఆంధ్ర ప్రదేశ్ లో 10 గిగావాట్ల (బిడబ్ల్యు) సామర్థ్యంతో పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులను ఏర్పాటు చేయడానికి తన ప్రణాళికలను ప్రకటించింది. భారతదేశపు స్వచ్ఛ ఇంధన లక్ష్యాలకు మద్దతు ఇవ్వడం, ఈ ప్రాంతంలో పర్యావరణ అనుకూల వృద్ధిని పెంపొందించడంలో కంపెనీ నిబద్ధతను ఈ కార్యక్రమం నొక్కి చెబుతుంది. ఆంధ్రప్రదేశ్, 2030 నాటికి 72 గిగా వాట్ల పునరుత్పాదక విద్యుత్ సామర్థ్యాన్ని సాధించాలనే లక్ష్యంతో, రాష్ట్ర హరిత లక్ష్యాలకు దోహద పడేందుకు సెరెంటికా వంటి పరిశ్రమ ప్రముఖులకు మార్గాలను తెరుస్తోంది. ఈ 10 గిగా వాట్ ప్రాజెక్టుల ద్వారా, సెరెంటికా ఈ ప్రాంతంలో స్థిరమైన పారిశ్రామిక వృద్ధికి పునాదిని వేయాలని లక్ష్యంగా పెట్టుకుంది.

అక్రమ పొగాకు వ్యాపారాన్ని నిర్మూలించేందుకు పీఎంఐ

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): చట్టవిరుద్ధమైన పొగాకు వర్తక నివారణపై తన నిబద్ధతను బలపరుస్తూ, ఫిలిప్ మోరిస్ ఇంటర్నేషనల్ పీఎంఐ భారతదేశ అనుబంధ సంస్థ, ఐపీఎం ఇండియా ఇటీవల ముగిసిన పారిశ్రామిక కార్యక్రమంలో అక్రమ పొగాకు వ్యాపారాన్ని అరికట్టడానికి ప్రభుత్వం నుంచి ప్రభుత్వాల వరకు సహకారం మరియు అంతర్జాతీయ నెట్వర్క్లపై ఇంటెలిజెన్సును పంచుకోవాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పింది. ఇటీవలి ఏడాద ల్లో భారతదేశంలో అక్రమ పొగాకు వ్యాపారంలో గణనీయమైన వృద్ధి కనిపించగా, ఇది గణనీయంగా పెరుగుతుందని అంచనా. అంతర్జాతీయంగా అక్రమంగా రవాణాతో వచ్చిన మరియు స్థానికంగా తయారు చేసిన పన న్ను ఎగవేత సిగరెట్లను కలిగిన అక్రమ సిగరెట్ వ్యాపారం ఇప్పుడు భారతదేశంలోని సిగరెట్ పరిశ్రమలో దాదాపు నాలుగింట ఒక వంతు వాటాను కలిగి ఉందని పొగాకు ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇండియా టిఐఐ తెలియజేసింది.

హైదరాబాద్లోని గోపన్పల్లి నడిబొడ్డున 123-ఎకరాల టౌన్‌షిప్

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): దక్షిణ భారతదేశంలోని ప్రముఖ రియల్ ఎస్టేట్ డెవలపర్ అయిన అపర కన్స్ట్రక్షన్స్ అండ్ ఎస్టేట్ ప్రైవేట్ లిమిటెడ్, హైదరాబాద్లోని గోపన్పల్లిలో ఉన్న అపర డెక్కన్ టౌన్తో అల్టాలా-లగ్జరీ లివింగ్ కు సంబంధించి నూతన శ్రేణి వ్యూహాన్ని ఆవిష్కరిస్తోంది. ఈ ప్రతిష్టాత్మక టౌన్షిప్ అలాటా-లగ్జరీ రెసిడెన్షియల్ మార్కెట్లో ప్రతిష్టాత్మకమైన ప్రయత్నాన్ని సూచిస్తుంది, అపర్ణ డెక్కన్ టౌన్ యొక్క మొదటి దశ కోసం రూ. 2,851 కోట్ల గణనీయమైన పెట్టుబడిని పెట్టనున్నారు. ఈ ప్రత్యేకమైన ప్రాజెక్ట్ తో, అపర్ణ కన్స్ట్రక్షన్స్ హైదరాబాద్లోని హై-ఎండ్ రెసిడెన్షియల్ విభాగం యొక్క సకైలైను పునర్నిర్వచించ డంతో పాటు, నగర అధునాతనతతో విలాసాన్ని మిళితం చేస్తోంది.

సరికొత్త డిజైర్‌ను ప్రారంభించిన మారుతి సుజుకీ

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): ఎలక్ట్రిక్ సన్ రూఫ్, 360 హెచ్ డిఎయూ కెమెరా, సుజుకీ కనక్ మరియు సరికొత్త ఎల్ఈడీ క్రిస్టల్ విజన్ హెడ్ ల్యాంప్స్ వంటి శ్రేణిలో మొదటి ఫీచర్లతో నిండింది.సరికొత్త డిజైర్ కు సుజుకీకి ప్రపంచంలోనే అత్యంత ఉత్తమమైన థర్మల్ సామర్థ్యంలో ఒకటిగా నిలిచిన జడ్- సిరీస్ 1.2 లీ ఇంజన్ మద్దతు ఇస్తోంది, దీనిని పెట్రోల్ ఎంటిలో 24.79 కిమీ/లీ మరియు ఎస్-సీఎన్జీ పవర్ ట్రైన్ లో 33.73 కిమీ/ కేజీ యొక్క ఇంధన సామర్థ్యంతో భారతదేశంలోనే అత్యంత ఇంధన సామర్థ్యం గల సిడాన్ గా చేసింది.

ఫినో బ్యాంక్ సేవింగ్ అకౌంట్ 'గుల్లక్' ప్రారంభం

విశాలాంధ్ర-విజయవాడ: ఖాతాదారులతో పొదుపు (సేవింగ్) చేయించడమే లక్ష్యంగా సేవింగ్ అకౌంట్ 'గుల్లక్' ప్రారంభించినట్లు ఫినో పేమెంట్స్ బ్యాంక్ జోనల్ హెడ్ మహ్మద్ ఇనాయతుల్లా తెలిపారు. నగరంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బ్యాంకింగ్ ప్రక్రియను సులువుగా, సరళంగా, సౌకర్యవంతంగా మార్చామన్నారు. ఇప్పుడు ఖాతాదారులు తమ సేవింగ్స్ ను ఆదా చేయడంపై దృష్టి పెట్టామన్నారు. ఖాతాదారుల ప్రత్యేక అవసరాలను తీర్చడంలో భాగంగా అనేక ప్రయోజనాలు అందించేందుకు ఈ అకౌంట్ ప్రారంభించామని తెలిపారు. ఫినో బ్యాంక్ 25000 మర్చంట్ పాయింట్లలో దేనిలోనైనా గుల్లక్ ఖాతా తెరవవచ్చన్నారు. రూ. వెయ్యి కనిష్ట ఖాతా బ్యాలెన్స్ ఖాతాదారులు వార్షిక ప్లాన్ రుసుం చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. రూపే డెబిట్ కార్డుపై ఆఫర్లను ఆస్వాదించవచ్చన్నారు. కొన్ని ప్రమాణాలకు అనుగుణంగా కనీస ఖాతా బ్యాలెన్స్ మాఫీ కూడా ఉందన్నారు. ఇందులో భాగంగా ఖాతాదారులు నెలలో కనీసం రూ.500 విలువైన ఐదు యూపీఐ లావాదేవీలు ఫినోపే మొబైల్ యాప్ ద్వారా చేయడం గానీ, ఫినో భాగస్వామ్య బ్యాంకు ద్వారా కనీసం రూ.5000 ఒక సంవత్సరం ఫిక్స్ డిపాజిట్ చేయడం గానీ, ఖాతాలో ఏదైనా ప్రభుత్వ సంక్షేమ పథకం క్రెడిట్ కావడం గానీ ఉండాలన్నారు. ఈ మూడింటిలో ఏ ఒక్కటి ఉన్నా ఖాతాలో రూ. వెయ్యి కన్నా తక్కువ బ్యాలెన్స్ ఉన్నా కనీస బ్యాలెన్స్ రుసుములు ఉండవన్నారు. గుల్లక్ (పిగ్గీ బ్యాంక్) ప్రాముఖ్యత కలిగినదని చెప్పారు.

విద్యార్థులకు చదువుతోపాటు వినోదం

విశాలాంధ్ర-విజయవాడ స్పోర్ట్స్ : విద్యార్థులకు చదువుతోపాటు వినోదాన్ని అందించడం అభినందనీయం అని పలువురు వక్తలు అన్నారు. విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందిస్తూ మరోవక్క పేద మధ్యతరగతి విద్యార్థులకు ఉన్నత స్థాయిలో ఉన్న మల్టీప్లెక్స్ సినిమా హాల్లో సినిమాను చూపించడంతో, వారిలో మనోధైర్యాన్ని పెంపొందించి మానసిక ఉల్లాసాన్ని కల్పించడమే తమ లక్ష్యమని చెప్పారు. రౌండ్ టేబుల్ ఇండియా శాఖ విజయవాడ రౌండ్ టేబుల్, లేడీస్ సర్కిల్,అమరావతి రౌండ్ టేబుల్,లేడీస్ సర్కిల్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లోని సుమారు 250 మంది విద్యార్థులకు పీవీపీ మాల్ లోని సినీ పోలిస్ థియేటర్లో సోమవారం వేర్ ఇన్ చోటా భీమ్ సినిమాను ప్రదర్శించి,విశ్రాంత సమయంలో విద్యార్థులకు తినుబండరాలు అందజేయడం తో పాటు పెన్సిల్ బాక్స్ లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విజయవాడ రౌండ్ టేబుల్ లేడీస్ సర్కిల్ ఛైర్ పర్సన్ అలేఖ్య మాట్లాడుతూ సినీపోలీస్, రౌండ్ టేబుల్ ఇండియా స్వచ్ఛంద సంస్థ, లేడీస్ సర్కిల్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం నాడు దేశంలోని 38 పట్టణాలలో పదివేల మంది పైగా ప్రభుత్వ పాఠశాలలో విద్య అభ్యసిస్తున్న విద్యార్థిని, విద్యార్థులకు వేర్ ఇన్ చోటా భీమ్ సినిమాను చూపించామన్నారు. .అనంతరం రౌండ్ టేబుల్ ఇండియా ఏరియాచైర్మన్ అశ్విన్,వైస్ చైర్మన్ కౌశిక్ సినిపోలీస్ మేనేజర్ మురళి కృష్ణ తదితరులు పాల్గొని మాట్లాడారు... పేద మధ్యతరగతి విద్యార్థులకు ఉన్నత స్థాయిలో ఉన్న మల్టీప్లెక్స్ సినిమా హాల్లో సినిమాను చూపించడం, వారిలో మనోధైర్యాన్ని పెంపొందించి మానసిక ఉల్లాసాన్ని కల్పించడమే తమ సంస్థ ముఖ్య ఉద్దేశమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఒకేసారి 30 వేల మంది చిన్నారులకు వేర్ ఇన్ చోటా భీమ్ సినిమాను ప్రదర్శించామని తెలియజేశారు. తమ సంస్థ పేద విద్యార్థుల చదువు కోసం ఎంతగానో కృషి చేస్తుందని పేర్కొన్నారు. తమ సంస్థ పాఠశాలల్లో అదనపు తరగతి గదుల నిర్మాణం,మరుగుదొడ్ల నిర్మాణం చేపడుతూ సమాజాభివృద్ధికి తమ వంతు కృషి చేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో అమరావతి రౌండ్ టేబుల్ ఛైర్ పర్సన్ సమీక్ష, విజయవాడ సర్కిల్ చైర్మన్ వెంకట్,రౌండ్ టేబుల్ ఇండియా ప్రతినిధులు కాట్రగడ్డ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన 35వ మోంటోఫోర్ట్ స్పోర్ట్స్ గేమ్స్

విశాలాంధ్ర-విజయవాడ స్పోర్ట్స్ : స్థానిక ఎన్. ఎస్. ఎం పబ్లిక్ స్కూల్లో 35వ మోంట్ ఫోర్ట్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మౌంట్ జెనిత్ 2024 పేరిట గత మూడు రోజుల నుండి ఈ క్రీడా పోటీలు జరుగుతున్న విషయం విధితమే. పలు విభాగాలకు సంబంధించిన క్రీడల పోటీలు 9వ తేదీన ప్రారంభమై సోమవారం సాయంత్రం ముగిశాయి. మూడు రోజులు పాటు జరిగే పోటీలకు 30 పాఠశాల నుండి సుమారు 1500 మంది విద్యార్థులు పాల్గొన్నారు. మోంట్ ఫోర్ట్ విద్యాసంస్థలకు సంబంధించిన వివిధ పాఠశాలల విద్యార్థులు ఈ పోటీలలో పాల్గొన్నారు. ముగింపు కార్యక్రమానికి అధ్యక్షులుగా మోస్ట్ రెవరెండ్ జోసెఫ్ రాజారావు తెలగ తోటి (బిషప్, విజయవాడ) వ్యవహరించారు. గద్దె రామ్మోహన్ రావు (శాసనసభ్యులు, ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం). గెలుపొందిన విజేతలకు, పాఠశాలలకు, ముఖ్య అతిథి ట్రోఫీలను అందజేశారు. ఈ సందర్భంగా గద్దె రామ్మోహన్ రావు మాట్లాడుతూ ఎన్ ఎస్ ఎం పాఠశాల క్రీడలకు అధిక ప్రాధాన్యత కల్పిస్తుందని ఈ సందర్భంగా కొనియాడారు. ప్రస్తుత యాంత్రిక జీవన విధానంలో క్రీడలు చాలా అవసరమని తెలియజేశారు. ప్రతి విద్యార్థి విద్యతో పాటుగా ఏదో ఒక క్రీడలో నైపుణ్యం సాధించాలని క్రీడలు ఆరోగ్యాన్నే కాకుండా, మానసిక ఆనందాన్ని అందిస్తాయని అన్నారు. పాఠశాలలు విద్యతో పాటుగా క్రీడలకు సమాన ప్రాధాన్యత కల్పించాలని సూచించారు. ఎన్.ఎస్.ఎం పాఠశాల క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇవ్వడమే కాకుండా విద్యార్థుల అభిరుచికి అనువైన ఉన్న క్రీడ పట్ల తగిన శిక్షణ ఇవ్వడంలో ముందంజలో ఉంటుందని ఈ సందర్భంగా అన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ బ్రదర్ రాయప్ప రెడ్డి మాట్లాడుతూ మూడు రోజుల నుండి ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ పోటీలు మాకు ఎంతో ఆనందాన్ని, ఉత్తేజాన్ని కలిగించాయని అన్నారు. కేవలం మార్కుల కోసమే విద్య కాకుండా క్రీడ అంశాలు పట్ల బోధన కల్పించాలని క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. క్రీడలు విద్యార్థులలో మానసిక ఉల్లాసమే కాకుండా, ఆరోగ్యకరమైన జీవితాన్ని అందిస్తుందన్నారు. వీటిని స్ఫూర్తిగా తీసుకొని భవిష్యత్తులో ఇలాంటి మరెన్నో నిర్వహించగలమని తెలిపారు. ఈ క్రీడా ఉత్సవాలకు సహకరించిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు, న్యాయ నిర్ణీతలగా విచ్చేసిన వ్యాయామ ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, విద్యార్థులకు ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మూన్ ఫోర్ట్ విద్యాసంస్థల అధ్యక్షులు రెవరెండ్ బ్రదర్ పైన్ అలెక్స్, జనరల్ సెక్రటరీగా వ్యవహరించిన రెవరెండ్ బ్రదర్ కేటీ చాకో, వివిధ విద్యాసంస్థల ప్రధానోపాధ్యాయులు, పాఠశాల కరస్పాండెంట్ బ్రదర్ మోంటీ, పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ బ్రదర్ బాలా రెడ్డి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గురునానక్ కాలనీలో 'కనని' బ్యూటీ పార్లర్

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): విజయవాడ గురునానక్ కాలనీలో నూతనంగా "కనని " బ్యూటీ పార్లర్ ప్రారంభమైంది. ఈ సందర్భంగా నిర్వాహకురాలు కె. ఉషారాణి మాట్లాడుతూ నేటి యువతీ యువకులు సౌందర్యం పట్ల ఎంతో ఆసక్తి శ్రద్ధ కనబరుస్తున్నారని వారికి మెరుగైన ఆధునికమైన సౌందర్య సేవలు అందించాలన్నదే ప్రధాన ధ్యేయమని తెలిపారు. బ్యూటిషియన్ గా శిక్షణ పొంది, 19 ఏళ్ల పనిచేసిన అనుభవం ఉందని, అనుభవంతోనే సౌందర్యాభిలాషులకు అతి తక్కువ ధరలో మెరుగైన సేవలు అందించాలని బ్యూటీ పార్లర్ ను స్థాపించానని తెలిపారు. సామాన్య ప్రజలకు కూడా అత్యాధునిక సదుపాయాలతో "కనని" బ్యూటీ పార్లర్ లో సేవలు ఉంటాయని తెలిపారు. పదిమందికి ఉపాధి కల్పించాలన్న ప్రధాన లక్ష్యమే బ్యూటీ పార్లర్ స్థాపించడానికి కారణన్నారు. మా దగ్గర సౌందర్యాభిలాషులకు అనుగుణంగా, అత్యాధునిక పరికరాలతో సౌందర్య సేవలు నిర్వహించబడతాయని తెలిపారు. సెలూన్, స్కిన్, లేజర్, అవాంఛిత రోమాలు శాశ్వత పరిష్కారం కోసం ప్రత్యేక చికిత్సలు అనుభవ విసులైన వైద్యుల పర్యవేక్షణ ఉంటాయని తెలిపారు.

భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు

విశాలాంధ్ర-చల్లపల్లి : కార్తీక సోమవారం శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మహిమాన్విత శైవక్షేత్రం నడకుదురు శ్రీపృథ్వీశ్వరక్షేత్రంలో భక్తులు పోటెత్తారు. చల్లపల్లి సీఐ కె. ఈశ్వరరావు దంపతులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. చల్లపల్లి పరిసర గ్రామాల నుంచే కాక సుదూర ప్రాంతాల నుంచి సైతం భక్తులు తరలివచ్చారు. చల్లపల్లి, లక్ష్మీపురం, పాగోలు శివాలయాల్లో మహిళలు దీపారధనలు చేశారు. కార్తీక సోమవారం వ్రతాలు చేసే దంపతులు శివాలయాలకు వెళ్లి స్వామివారిని దర్శించుకున్నారు.